J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 44 సంచిక : 15 13.09.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# నేతలు.. దాతలు కావాలి

## ఆపద సమయంలో ఆదుకోవాలి

### ఎన్నికల తరుణంలో వందల కోట్లు కళ్ళు మూసుకుని ఖర్చుపెట్టే రాజకీయ నాయకులు.. విపత్తులు వచ్చిన వేళ విజ్ఞత చూపాలి

***దే**శంలోని అనేక ప్రాంతాలలో తరచూ ప్రకృతి ప్రళయతాండవం చేస్తూనే ఉంది. ఎన్ని చేదు అనుభవాలు ఎదురైనా మేల్కోని ప్రభుత్వాల అలసత్వానికి, నిర్లక్ష్య ధోరణికి నిదర్శనంగా ప్రతీసారీ కొన్ని వందల కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. ప్రకృతి ప్రకోపానికి బలైపోతూనే ఉన్నాయి. ఇదే క్రమంలో తాజాగా రెండు తెలుగు రాష్ట్రాలలో వచ్చిన వానలు, వరదలు వేలాదిమంది బ్రతుకులని అతలాకుతలం చేశాయి. బాధితులని ఆదుకోవడానికి రెండు రాష్ట్రాల్లోని పారిశ్రామికవేత్తలు ఒక్కొక్కరుగా ముందుకొస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అందరికంటే ముందుగా అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం, టాంప నగరంలో నివసించే తెలుగు సంఘ సేవకులు గుత్తికొండ శ్రీనివాస్ స్పందించి తనవంతుగా కోటి రూపాయల చెక్కుని ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందజేశారు. రాజకీయాలతో ఎలాంటి సంబంధంలేని వ్యక్తులలో మొట్టమొదటిగా ముందుకొచ్చిన మనసున్న దాత గుత్తికొండ శ్రీనివాస్. ఇక వ్యాపార, పారిశ్రామిక, నిర్మాణ రంగాలతో పాటు ఇతర పలు రంగాలతో సంబంధం లేకుండా రాజకీయ రంగం నుండి తొట్టతొలుతగా స్పందించిన నేతలు వేమిరెడ్డి దంపతులు. వాళ్ళు తమ సాయంగా కోటి రూపాయలు సీఎం సహాయనిధికి అందించారు. అక్కడి నుండి మొదలైన విరాళాల పర్వం ఒక వరదలా కొనసాగుతూనే ఉంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి, సుజనా చౌదరి, పెమ్మసాని చంద్రశేఖర్ వంటి ఇంకా కొంతమంది రాజకీయ నేతలు కూడా తమవంతుగా సహకరిస్తూనే ఉన్నారు.*

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లాంటి వారు పక్క రాష్ట్రానికి కూడా సాయం చేస్తున్నారు. సినిమా పరిశ్రమ సైతం రెండు తెలుగు రాష్ట్రాలకి తమకి చేతనైన సాయం అందిస్తోంది. తాము కేవలం తెరపైనే కాదు నిజజీవితంలో కూడా హీరోలమే అన్నట్లుగా స్టార్స్ స్పందిస్తున్నారు.

### రాజకీయ నేతలందరూ స్పందించాలి!

తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన తుఫాను మిగిల్చిన నష్టాన్ని కళ్లారా చూస్తున్నాం. చాపకింద నీరులా వ్యాపించి ఊళ్లను ముంచిన వరద మిగిల్చిన కష్టం చెవులారా వింటున్నాం. ఇలాంటి పరిస్థితుల్లోనే... మేం ప్రజాప్రతినిధులం, మీ సేవకోసమే బ్రతుకుతున్నాం అంటూ మొన్న ఎన్నికల్లో పోటీచేసి గెలిచినవారు, ఓడినవారు, టిక్కెట్ ఆశించి భంగపడి నానా యాగీ చేసినవారు అందరూ... ప్రజాజీవితంలో తమ నిబద్ధతను నిరూపించుకోవాలి. ఇంటికో పువ్వు.. ఈశ్వరునికో మాల అన్న చందంగా అన్ని చేతులు కలిస్తే, బాధితుల కష్టాలకి కాస్తంత ఉపశమనం దొరుకుంది.

అసలైన సేవ చేయాల్సిన సమయం ఆసన్నమయ్యింది. మన సాయం కోసం వేలాది మంది అభాగ్యులు ఎదురు చూస్తున్నారు. ఇటువంటి తరుణంలో మనం చేసే సాయమే నిజమైన దానం. మనకు తోచింది అది ఎంత చిన్నదైనా కావచ్చు... అది ఆపన్నులకు చాలా పెద్దదిగా ఉపయోగపడుతుంది. కష్ట కాలంలోనే ప్రతి ఒక్కరూ దాతృత్వగుణంతో వ్యవహరించాలి. మరీ ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో కీలక భాగస్వామ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన తరుణం ఇదే.

### ఎన్నికల వేళ వేలకోట్ల ఖర్చు!

రాజకీయ నేతలు ఎన్నికల సమయంలో లెక్కకు మించి ఖర్చులు చేస్తుంటారు. అది అధికారం కోసం చేసే దండగ ఖర్చు. మొన్నటి ఎన్నికలలో ఒక్క తెలుగు రాష్ట్రంలోనే అన్నీ పార్టీలలోని మన ప్రజా ప్రతినిధులు సుమారు 10 వేల కోట్లకి పైగా ఖర్చు చేశారని మేధావులు చెప్తున్నారు. మరి ఇలాంటి సమయంలో వాళ్లంతా ఎందుకు ముందుకు రావటం లేదన్నది సమాధానం దొరకని ప్రశ్న. అధికారంలో ఉన్న వారు మాత్రమే కాదు, అధికారాన్ని పొందని వారు కూడా ప్రజలకి నిజమైన సేవ అందించడానికి సరైన సమయం ఇదే. ప్రజలంటే మన నియోజక వర్గంలోని వారు మాత్రమే కాదు, దేశమంతా మనదే అనే భావనతో ప్రజా ప్రతినిధులు ముందుకు సాగాలి. అంతేకాదు పార్టీ వర్గాల్లో స్ఫూర్తిని నింపాలి. పార్టీలకు అతీతంగా సాయం అందించేందుకు ముందుకు రావాలి.

భగవద్గీతలో పరమాత్ముడు చెప్పినట్లు....

'దాత'వ్య మితి యద్దానం దీయతే నుపకారిణే?

దేశే కాలేచ పాత్రేచ తద్దానం సాత్త్వికం స్మృతమ్?

మంచి మనసుతో, ప్రత్యుపకారం ఆశించకుండా, సరైన సమయంలో, సరైన వారికి చేసే దానాన్ని సాత్విక దానం అని అంటారు. ఇది ఆర్థిక అంశాలకే కాదు, సాయానికి కూడా వర్తిస్తుంది. ఇలాంటి సాయం చేయటానికి ఉప్పెనగా, ఉమ్మడిగా అందరూ సిద్ధం కావాలి.

ప్రజాప్రతినిధులు అంటే చాలా మంది ప్రజల్లో ఒక తేలిక భావం ఉంది. వాళ్ళు ప్రజల్ని దోచుకుంటారని, ఏ సాయం చేయరనే ఓ నింద కూడా ఉంది. ఇది

10 లో

• స్పందించిన సహృదయం



# జీవీకే 5 కోట్ల సాయం

### తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి

### ఐదుకోట్ల చెక్కు అందించిన జీవీకే రెడ్డి

***ప్ర**ముఖ పారిశ్రామికవేత్త, సహృదయమున్న దాత గునుపాటి వెంకటకృష్ణారెడ్డి (జీవీకే రెడ్డి) తెలంగాణ వరద బాధితులకు అండగా నిలిచారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి తనవంతు విరాళంగా 5కోట్ల రూపాయల చెక్కుని సెప్టెంబర్ 9న సీఎం రేవంత్‌రెడ్డికి అందచేశారు.*

సుమారు 87 సంవత్సరాల వయస్సులో తానే స్వయంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి చెక్కు అందించారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు గునుపాటి సంజయ్‌రెడ్డి, కుమార్తె శాలిని భూపాల్, మనుమలు గునుపాటి కేశవ్‌రెడ్డి, కృష్ణ రాంభూపాల్ ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీవీకే రెడ్డిని దుశ్శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

### కష్టం ఎప్పుడొచ్చినా!

గతంలో కూడా అనేక సందర్భాలలో తెలంగాణ, ఆంధ్ర ప్రజల కోసం జీవీకే తనవంతు విరాళాలు అందించారు. కరోనా తరుణంలో ఆంధ్రా, తెలంగాణ, మహారాష్ట్రలకి కలిపి సుమారు 10 కోట్లా 50 లక్షల రూపాయలని జీవీకే వితరణగా ఇచ్చారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

10 లో



# ఓం.. గణేశాయ నమః

## జిల్లావ్యాప్తంగా గణపయ్యకు విశేష పూజలు

## వాడవాడలా ఉత్సాహంగా వినాయక చవితి సంబరాలు



*వినాయకచవితి సందర్భంగా ఈనెల 7వ తేది జిల్లాలో వాడవాడలా అంగరంగ వైభవంగా సంబరాలు జరిగాయి. ఆలయాల్లో గణేశునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇళ్ళలో పూలు పత్రితో, వినాయకుని ప్రార్థిస్తూ పూజలు చేసుకున్నారు. వీధివీధినా ఎక్కడ చూసినా వినాయక మండపాలతో, వినాయకుని భక్తిగీతాలు, భజనలు, కోలాటాలతో, గణనాథుని నామోచ్చారణలతో జిల్లా మార్మోగిపోయింది. ప్రత్యేకించి జిల్లా కేంద్రమైన నెల్లూరులో వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. అన్ని ప్రాంతాలు విఘ్నేశ్వరుని పూజలతో కోలాహలంగా మారిపోయాయి. జై గణేశా!..జైజై గణేశా!..అంటూ చిన్నా పెద్దా అందరూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని మూడురోజులు, అయిదు రోజులు, వారం రోజులు, కొన్నిచోట్ల 11 రోజుల పాటు కూడా సంబరాలు చేసుకోవడం ఆనవాయితీ! జిల్లాలోని అనేకప్రాంతాల్లో గణేశుడు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తుల పూజలందుకున్నాడు. అనేకరూపాల్లో పెద్దపెద్ద గణనాయకుని విగ్రహాలు కొలువుదీరడంతో ఆయా ప్రాంతాల్లోని భక్తజనం సంతోషసంరంభాలతో సంబరాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో వినాయకునికి పూజలు చేసుకున్నారు.*

జిల్లాలో వినాయకచవితి సంబరాలు మిన్నుముట్టాయి. వాడవాడలా, ప్రతివీధిలోనూ వినాయక మండపాలు వెలిశాయి. అన్ని మండపాలు విద్యుద్దీపాలతో మెరిసిపోయాయి. పూల అలంకరణలతో పోటీపడి నిర్వాహకులు ఎక్కడికక్కడ భారీస్థాయిలో సంబరాలు నిర్వహించారు. అనేక రూపాలతో ఆకర్షణీయంగా రూపొందించిన భారీ విగ్రహాలను సందర్శించి భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఉట్టి ఉత్సవాలు, సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలతో ఆయా ప్రాంతాలు సందడిగా మారాయి. ఎక్కడ చూసినా వినాయక మండపాలవద్ద పెద్దసంఖ్యలో భక్తులు బారులు తీరి కనిపించారు. ప్రత్యేకించి నెల్లూరులోని అన్ని కూడళ్ళలో మిత్రమండళ్ళవారు, గణేష ఉత్సవ సమితి నిర్వాహకులు, భక్త బృందాలతో వినాయకమండపాల్లో ఘనంగా పూజలు చేశారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

### విరివిగా అన్నదానాలు :

నెల్లూరు నగరంలోని చిన్నబజారు, రాణాప్రతాప్ సెంటర్, పెద్దబజారు, కాపువీధి, ట్రంకురోడ్డు, ఏసీనగర్, విఆర్‌సి సెంటర్, మూలాపేట, రంగనాయకులపేట, రామలింగాపురం, హరనాథపురం, రామ్‌నగర్, దర్గామిట్ట, వేదాయపాళెం, చంద్రమౌళినగర్, అయ్యప్పగుడి సెంటర్, వైఎస్సార్‌నగర్ ఇలా ఒకచోటేమిటి అన్ని చోట్ల వినాయకమండపాలు అందంగా కొలువుదీరాయి. ప్రతి చోటా ఎంతో భక్తిశ్రద్ధలతో, వ్యయప్రయాసలతో ఏర్పాటుచేసిన మండపాలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. అనేక ప్రాంతాల్లో విరివిగా అన్నదానాలు జరిగాయి. కొన్ని చోట్ల సేవా భావంతో భక్తులు రక్తదానాలు కూడా చేశారు. ఈ సంబరాల్లో భాగంగా, పలు మండపాల వద్ద వినాయకుని లడ్డూ వేలంపాటలు జోరందుకున్నాయి. పెద్దమొత్తాలు వెచ్చించి భక్తులు స్వామివారి లడ్డూలను దక్కించుకుని భక్తులకు పంపిణీ చేశారు. ఉత్సవాల ప్రారంభం వద్ద నుంచి నిమజ్జనోత్సవం దాకా ఈ వేడుకల్లో భక్తులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న వినాయక మండపాలు :

మాగుంట లేఅవుట్‌లో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి కూడలి వద్ద లంబోదర గణేశ్ సెంటర్‌లో జరిగిన వినాయకచవితి సంబరాలు మరింత వైభవోపేతంగా జరిగాయి. భారీ వినాయకుని విగ్రహంతో పాటు, అత్యంత సుందరంగా అలంకరించిన మండపం, అందులో భారీ ఏర్పాట్లు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ సెంటర్‌లో తొలిసారిగా ఏర్పాటుచేసిన ఈ వినాయక మండపం అందరి ప్రశంసలందుకుంది. వేలసంఖ్యలో భక్తులు పాల్గొని లంబోదరుణ్ణి దర్శించుకున్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులంతా ఆ వినాయక మండపం చూసి ముగ్ధులయ్యారు. బుధవారం సాయంత్రం నిమజ్జనోత్సవాలను కూడా వైభవోపేతంగా నిర్వహించారు. అదేవిధంగా, బాలాజీనగర్‌లో 18 అడుగుల మట్టి గణపతి విగ్రహంతో పాటు అయోధ్య శ్రీరామమందిరం, ధనుస్సును సంధిస్తున్న శ్రీరామచంద్రుని విగ్రహాలను స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు భారీ ఎత్తున ఏర్పాటుచేశారు. ఉట్టి ఉత్సవాలు, నాట్య, సంగీత కార్యక్రమాలతో మండపాలు హోరెత్తాయి. నగరంతో పాటు, జిల్లావ్యాప్తంగా గ్రామ గ్రామానా జరిగిన ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంతరాలు జరగకుండా జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

# డీసీసీ అధ్యక్షునిగా.. మళ్లీ చేవూరు



## మూడోసారి కూడా ఆయనకే పదవీ కిరీటం

డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) అధ్యక్ష పదవి మళ్ళీ చేవూరు దేవకుమార్‌రెడ్డిని వరించింది. పార్టీ అధికారంలో లేకున్నా, క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి దేవా చేస్తున్న కృషికి గుర్తింపుగా, మూడవసారి కూడా ఆయన్నే కాంగ్రెస్ అధిష్ఠానం అధ్యక్షపదవికి ఎంపిక చేయడం విశేషం. ఈ పదవికి పలువురు నాయకులు గట్టిగా ప్రయత్నించినప్పటికీ, చేవూరుకే పీఠం దక్కడం విశేషం. ఎంతోకాలంగా కాంగ్రెస్‌కు నమ్మినబంటుగా ఉంటూ, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సైతం పార్టీని వీడకుండా, జిల్లాలో పార్టీ చెల్లాచెదురు



కాకుండా కాపాడుకుంటూవస్తున్న ఆయన ఎంపిక పట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. డీసీసీ అధ్యక్ష పదవికి మూడోసారి కూడా తనను నియమించినందుకు చేవూరు కాంగ్రెస్ అధిష్ఠానానికి తన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేసేందుకు కృషిచేస్తానని ఆయన దృఢంగా చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఈనెల 8న నెల్లూరులోని చేవూరు నివాసానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలిసి, ఆత్మీయంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకుడు ఉడతా వెంకట్రావు యాదవ్‌ను కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా అధిష్ఠానం నియమించడంతో పార్టీవర్గాలు సంతోషం ప్రకటించాయి.

# అట్టహాసంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం




తోటపల్లిగూడూరు మండలం చెన్నపల్లి పాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని అట్టహాసంగా జరుపుకున్నారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మహమ్మద్ అజాద్ పాల్గొని వయోజన విద్య ప్రాధాన్యతను తెలియజెప్పారు. భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు ఫణికుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మహాలక్ష్మి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి గ్రామస్తులకు అక్షరాస్యతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా అజాద్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఏడాది నూటికి నూరుశాతం జిల్లాలో అక్షరాస్యత సాధనకు పెద్దఎత్తున కృషిచేయడం జరుగుతోందని తెలిపారు. ఆ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం. అక్షరాస్యత కార్యక్రమాల అమలులో ఫణికుమార్ సేవలను ప్రస్తుతిస్తూ ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఏపీఓ మస్తాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మోహన్, రమణప్రసాద్, పీడీ నాగరాజు, గ్రామ ప్రముఖులు బైనబోయిన శ్రీనివాసులు, ఊటుకూరు ధర్మదేవ్, రాజన్న, అవినాష్, సునీల్, విద్యాకమిటీ ఛైర్మెన్ ఠాగూర్, వయోజన విద్య సూపర్‌వైజర్ రాజశేఖర్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. విద్య ప్రాధాన్యతను వివరిస్తూ, జానపద కళావేదిక చక్రపాణి బృందం ఆలపించిన గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# రెగ్యులరైజ్ చేయాలంటూ.. నర్సుల ఆందోళన



స్టాఫ్ నర్సుల ఉద్యోగ నియామకాలను రెగ్యులర్ విధానంలోనే సత్వరం పూర్తి చేయాలని, జీఓ నంబరు 115ను రద్దు చేయాలని కోరుతూ నెల్లూరులో ఈనెల 9న స్టాఫ్‌నర్సులు జిల్లా ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఏపీఎస్సార్ మెడికల్ నర్సింగ్ కాంట్రాక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వేణు, రూతుగ్రేస్ మాట్లాడుతూ, బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ పూర్తిచేసినవారు గత పదిహేనేళ్ళుగా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని, వారి స్థానంలో ఏఎన్ఎంలను నియమించడం అన్యాయమన్నారు. ఇప్పటివరకు తమకు రెగ్యులర్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ఇకనైనా తమను రెగ్యులర్ చేయాలని కోరారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌కు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవింద్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

# రైతు సంఘం ధర్నా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదంటూ మండల కేంద్రమైన మనుబోలులో రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8 ధర్నాందోళన చేపట్టారు. సీపీఎం నాయకుడు కటికాల వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకుడు తలారి దేవదానం మాట్లాడుతూ, ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కౌలురైతులకు రుణాలివ్వడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. మనుబోలు మండలం కాగితాలపూరులో 30 ఏళ్ళుగా రైతులు సాగుచేసుకుంటున్న పొలాలకు ఇప్పటికీ పట్టాలివ్వలేదని విమర్శించారు. అనంతరం తహశీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు.

# మహిళా వైద్యుల నిరసన



ఇటీవల కోల్‌కత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచారానికి నిరసనగా నెల్లూరులోని మహిళా డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు, స్థానిక ప్రముఖ వైద్యనిపుణురాలు డాక్టర్ యశోధర ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పొగతోట, బృందావనం తదితర ప్రాంతాల్లో ఉన్న మహిళా వైద్యులు పాల్గొని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులకు కఠిన శిక్ష పడాలని కోరారు. ఈ ఆందోళనలో డాక్టర్ సుప్రజ, డాక్టర్ చైతన్య, డాక్టర్ మిథిలాశ్రీ, డాక్టర్ హారిక, ఐఎంఏ నాయకులు డాక్టర్ అశోక్, డాక్టర్ పీఎస్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల సౌభాగ్యం కోసం..
# త్వరలోనే 'శాంతి యజ్ఞం'
## - రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం వెల్లడి



అన్ని ఉపద్రవాల నుంచి కాపాడే చల్లనితల్లి.. ఆ దుర్గమ్మ అమ్మవారేనని, విజయవాడ ప్రజలు వరదల నుంచి గట్టెక్కాలని, రాష్ట్రం అన్ని కష్టాల నుంచి బయటపడి సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఆయన ఇటీవల విజయవాడలోని కనకదుర్గమ్మ దేవాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించామని, రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా, సుఖసౌభాగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటూ త్వరలోనే శాస్త్రోక్తంగా శాంతియజ్ఞం నిర్వహించాలని భావిస్తున్నామని తెలిపారు. రానున్న నవరాత్రి వేడుకలకు బెజవాడ కనకదుర్గమ్మ ఆలయానికి సంబంధించిన అన్ని పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. తొలుత, ఆయన దుర్గమ్మ ఆలయ ఘాట్‌రోడ్డు పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. అనంతరం అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు.

### అలుపెరుగని మంత్రి..'ఆనం' :

విజయవాడ వరద సహాయక కార్యక్రమాల్లో అలుపెరగకుండా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బాధితులకు సేవలందిస్తుండడం అందరినీ ప్రభావితం చేస్తోంది. బాధితులైన ప్రతి ఒక్కరికి మంచినీరు, ఆహారం, నిత్యావసరాల సరఫరాకు లోటురాకుండా ఎప్పటికప్పుడు ఆయన ప్రత్యేకశ్రద్ధతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వం అండగా ఉన్నారని, అధైర్యపడాల్సిన అవసరం లేదని, అన్నివిధాలా సాయం అందిస్తామని బాధితులకు భరోసా ఇస్తున్నారు. పభుత్వం తనకు కేటాయించిన విజయవాడలోని పలు డివిజన్లలో బాధితులకు ఆహారం, మంచినీరు అందరికి అందేలా చూశారు. నిత్యావసరాలు దగ్గరుండి ఇప్పించారు. వరదనీళ్లల్లోనే ఉన్న వారిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ వారికి అన్ని వసతులు కల్పించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో అధికార గణమంతా అప్రమత్తంగా ఉంటూ బాధితులకు అవసరమైన అన్నిసేవలను అందిస్తోంది.

# వరద బాధితులకు తోడుగా కోవూరు ఎమ్మెల్యే
### దాతలు ఇచ్చిన 4 లక్షల విరాళాన్ని.. మంత్రికి అందజేసిన ప్రశాంతిరెడ్డి



విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల బాధితులను ఆదుకునేలా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంచి మనసుతో చొరవ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో, వరద విపత్తు నుంచి విజయవాడ ప్రజలను ఆదుకునేందుకు కోవూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు దాతలు అందజేసిన 4 లక్షల రూపాయల విరాళాన్ని ఇటీవల ఆమె విజయవాడలో ఉన్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణకు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు సూరా శ్రీనివాసులురెడ్డి - సూరా ప్రదీప 50వేల రూపాయలు, జక్కా వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ తరఫున సుంకర ఆదినారాయణ 2 లక్షల రూపాయలు, ఎం.కె. రియల్ ఎస్టేట్ వారు లక్షా 50వేల రూపాయలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి అందజేశారు. ఆ విరాళం చెక్కును డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులతో కలసి ఆమె మంత్రి నారాయణకు ఇచ్చారు.





# తొలి రాజకీయ గురువుతో మస్తానయ్య భేటీ!

తన తొలి రాజకీయ గురువు, ప్రస్తుత ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాజీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు భేటీ అయ్యారు. సెప్టెంబర్ 11వ తేదీ బుధవారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుని, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ని విజయవాడలో కలుసుకున్నారు. తన భవిష్యత్ కార్యాచరణపై తండ్రీ కొడుకులతో చర్చించారు. తన రాజ్యసభ సభ్యత్వానికీ, వైసీపీకి మస్తానయ్య రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

ఆత్మ, పరమాత్మలా ఉండే విజయసాయిరెడ్డి మాటని కూడా కాదని ఆయన వైసీపీని వీడారు. తన పూర్వ గురువుని, ఆయన వారసుడిని మస్తానయ్య కలుసుకోవడం జిల్లా రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయాలలో కూడా చర్చనీయాంశమయ్యింది. ఇంకా ఎంతమంది రాజ్యసభ సభ్యులని, శాసన మండలి సభ్యులని మస్తాన్‌రావు ప్రభావితం చేస్తారన్నది ఇప్పుడు సర్వత్రా నెలకొన్న ఉత్కంఠ. ఇప్పటికే జిల్లాకి చెందిన ఏంఎల్‌సి బల్లి కళ్యాణ్ కూడా తన తండ్రికి గురువు చంద్రబాబు పంచన చేరడానికి సంసిద్ధమై శాసనమండలికి రాజీనామా చేసిన సంగతి కూడా విదితమే!

### పెంచలకోనలో..
# 15 నుంచి పవిత్రోత్సవాలు



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం.. రాపూరు మండలంలోని పెంచలకోనలో ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో జరిగే పూజలు, సేవల్లో తెలిసో తెలియకో ఏదైనా దోషాలుంటే వాటి ప్రాయశ్చిత్తం కోసం ఈ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు రామయ్య స్వామి, పెంచలయ్యస్వామి తెలిపారు. 15వతేది సాయంత్రం అంకురార్పణ, శ్రీవార్లకు పవిత్రాల సమర్పణ, 16వ తేది ఉదయం అగ్నిప్రతిష్ఠ, విశేష ప్రాయశ్చిత్త హోమం వగైరా పూజలు నిర్వహించి, ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, పవిత్రాల సమర్పణ, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, విశేషహోమం నిర్వహిస్తామన్నారు. 17-18 తేదీల్లో కూడా అదేవిధమైన పూజలు ఉంటాయని, 18వ తేదీ రాత్రి పూర్ణాహుతి అనంతరం, స్వామి వారికి శేషవాహనోత్సవం కన్నులపండువగా ఉంటుందని తెలిపారు.

# గణపయ్యకు 'దీపమ్మ' పూజలు



వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో ఈనెల 11న పెద్దఎత్తున జరిగిన గణనాథుని శోభాయాత్రలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ (దీపమ్మ) పాల్గొని గణపయ్యకు ప్రత్యేకపూజలు చేశారు. ఏబీవీపీ పూర్వ విద్యార్థులు గత 40 సంవత్సరాలుగా ఇక్కడున్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలు ఈ సంవత్సరం ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులు ఇక్కడ అతిపెద్ద గణనాథుని విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, శీపా వంశీధర్ రెడ్డి, పి.నాగరాజారెడ్డి, రాఘవరెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు పిట్టి సత్యనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి..బిజెపి రాష్ట్ర నాయకులు పి.సురేంద్రరెడ్డి, కె.వి.సుబ్రమణ్యం, పేటేటి భాస్కరరావు, ఏ. శ్రీహరి, బి ఎస్ రంగరాజన్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజాపోరాట యోధుడు.. సీతారాం ఏచూరి అస్తమయం



ప్రముఖ వామపక్షయోధుడు, రాజకీయవేత్త, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గతనెల 19న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన ఆయన, చికిత్సపొందుతూ ఈనెల 12వ తేది గురువారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా నిబద్ధతతో పనిచేసిన ఆయన మృతితో సీపీఎం పార్టీ ఒక మహాయోధుని కోల్పోయినట్లయింది. ఆర్థికవేత్తగా, సామాజికవేత్తగా, కాలమిస్ట్‌గా ఆయన దేశవ్యాప్త ఖ్యాతిని పొందారు. 1952లో ఆయన చెన్నైలో జన్మించారు. ఆయన తల్లితండ్రులు ఏపీలోని కాకినాడ వాస్తవ్యులు. హైదరాబాద్‌లో ఆయన చదువుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి ఎంఏ పట్టా పొందారు. 1974 నుంచి విద్యార్థి నేతగా ఎస్‌ఎఫ్‌ఐలో ఉన్న ఏచూరి, 1984లో సీపీఎం కేంద్ర కమిటీలో చేరారు. 1992లో పొలిట్‌బ్యూరో సభ్యులయ్యారు. 2005-17 వరకు పశ్చిమ బెంగాల్ రాజ్యసభ సభ్యునిగా సేవలందించారు. 2015లో సీపీఎంకి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసే ఆయన మరణం సీపీఎం వర్గాలను, అభ్యుదయవాదులను ఆవేదనకు గురిచేసింది.

లాయర్
సెప్టెంబర్ 13, 2024

# ఆత్మవిశ్వాసంతో అపూర్వ విజయాలు

వైకల్యాన్ని అధిగమించి అంతర్జాతీయ క్రీడల్లో సైతం ప్రతిభాపాటవాలతో దేశఖ్యాతిని దశదిశలా చాటారు..మన పారా అథ్లెట్లు. దివ్యాంగులైనప్పటికీ ఏమాత్రం వెనుకంజ వేయకుండా ధీటుగా రాణించారు. గుండె నిబ్బరంతో, అంతులేని ఆత్మవిశ్వాసంతో పారిస్ ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటి, అనుకున్నదానికంటే ఎక్కువగానే పతకాలు సాధించి మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించారు. వివిధ దేశాల నుంచి 4400 మందికి పైగా మెరికలైన దివ్యాంగ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా, మనదేశం నుంచి 84మంది పాల్గొన్నారు. చైనా, బ్రిటన్, అమెరికాలు ఈ క్రీడల్లో మొదటి మూడు స్థానాల్లోనే ఉన్నా, భారత పారా క్రీడాకారులు కూడా ఈసారి పోటీపడి గతంలో కన్నా మరిన్ని పతకాలు సాధించుకోవడం విశేషం. అన్ని ప్రతికూల పరిస్థితులను అధిగమించి పోటీల్లో పాల్గొనడమే కాక, ఈసారి ఏకంగా 29 పతకాలు సాధించి 18వ స్థానంలో నిలవడం ఒక అద్భుతం. అందులోనూ గతంలో ఎప్పుడూ సాధించనంతగా 7 బంగారుపతకాలు, 9 రజత పతకాలు, 13 కాంస్య పతకాలు కైవసం చేసుకోవడం చరిత్రాత్మకం. మూడేళ్లక్రితం సాధించినదానికంటే ఈసారి పారా అథ్లెట్లు మరో 10 పతకాలు ఎక్కువగా సాధించి తమ సత్తా చాటారు. ఆ విజేతల్లో పదిమంది మహిళలు కూడా ఉండడం మరింత విశేషం.

వాస్తవానికి ఈ దివ్యాంగ క్రీడకారులందరివీ దయనీయమైన జీవితాలే. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా వారికి అన్నీ బాధలే. ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ. అయినా, అకుంఠిత శ్రమతో, నిరంతర సాధనతో విజయాలకు బాటలు వేసుకున్నారు. విశ్వవేదికలపై తమ అమేయమైన పట్టుదలను, పతకాలుగా, పతాకాలుగా ఎగురవేసి అందరికీ స్ఫూర్తిదాయకమవుతున్నారు. పుట్టుకతోనే రెండు చేతులు లేకున్నా కాలితోనే విల్లుపట్టి, భుజంతో నారిని ఎక్కుపెట్టి గురిచూసి లక్ష్యం సాధించడంలో జమ్ముకశ్మీర్‌కు చెందిన పదిహేడేళ్ళ క్రీడాకారిణి శీతల్‌దేవి ప్రతిభ ఆ యువ క్రీడాకారిణికి కాంస్యపతకం సాధించిపెట్టింది. చిన్న వయసులోనే రైలు ప్రమాదంలో కాలును పోగొట్టుకున్న నితీశ్ కుమార్, కృత్రిమపాదంతోనే పోటీల్లో ధీటుగా రాణిస్తూ బ్యాడ్మింటన్‌లో బంగారుపతకం సాధించడం ఒక అద్భుతం. వెన్నెముక నొప్పి బాధిస్తున్నా సుమిత్ అంటిల్ జావెలిన్ త్రోలో రెండోసారి చాంపియన్‌గా నిలవడం ఎంతో గొప్ప విషయం. ఆరోగ్యం ఏమాత్రం బాగలేకున్నా పంటిబిగువున అవనీ లేఖారా తుపాకీ గురితప్పకుండా లక్ష్యాన్ని ఛేదించింది. మన తెలుగుబిడ్డ, వరంగల్ జిల్లాకు చెందిన దీప్తి జీవాంజి 400 మీటర్ల పరుగుపందెంలో కాంస్యం సాధించింది. అనేకరకాల అవమానాలతో ఆవేదనలు..అవస్తల్లో ఉన్న పరుగుల రాణి ప్రీతిపాల్ ఏకంగా రెండు కాంస్యపతకాలు సాధించి చరిత్ర సృష్టించింది. కంటిచూపు తక్కువైనా సిమ్రన్‌శర్మ పతకం సాధించడం, చిన్నప్పుడు విద్యుత్‌ఘాతంతో కంటిచూపు కోల్పోయిన జూడోస్టార్ కపిల్‌పర్మార్ అంధుల జోడోలో మూడవ స్థానం సాధించుకోవడం అన్నీ అద్భుతాలే. ఇలా ఒక్కొక్కరూ తమ ప్రతిభాపాటవాలతో విజయాలను కైవసం చేసుకున్నారు.

ఏదేమైనా దివ్యాంగులకు మన ప్రభుత్వాలు ఇంకా చేయూతనివ్వాల్సి ఉంది. ఆణిముత్యాల్లాంటి వారు దేశంలో మరెందరో ఉన్నారు. వారి ప్రతిభకు మెరుగులు పెట్టేవిధంగా వారిని అటు ఆర్థికంగానూ, ఇటు సామాజికంగానూ ప్రోత్సహించాల్సి ఉంది. అందుకు అటు ప్రభుత్వాలు, ఇటు పాలకులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సి ఉంది. ముఖ్యంగా.. శారీరక-మానసిక దారుఢ్యాలతో పాటు అన్ని అవకాశాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ మన ఒలింపిక్స్ క్రీడాకారులు కేవలం ఆరు పతకాలతోనే సరిపెట్టుకుని, ఒక్క స్వర్ణం కూడా సాధించలేక, 71వ స్థానంలో చతికిలబడితే, అవయవాలు సరిగా లేక ఎన్నో బాధలుపడు తున్న దివ్యాంగులు అదే ప్యారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో ఏకంగా 29 పతకాలతో పాటు, 7 స్వర్ణపతకాలు కూడా సాధించి టాప్-20లో ఒకరుగా 18వ స్థానంలో నిలిచి, భారత్ కీర్తిపతాకను సగర్వంగా ఎగురవేయడం దేశానికే గర్వకారణం. కోట్లాదిరూపాయలు వెచ్చించి, ప్రభుత్వాల సహకారంతో ఒలింపిక్స్‌కు వెళ్ళి, ఏ పతకాలు సాధించలేక ఉత్తచేతుల్తో వచ్చే మన సాధారణ క్రీడాకారులు.. ఇకనైనా అసాధారణ క్రీడాకారులైన ఈ దివ్యాంగులను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఏదేమైనా, అటు శారీరక వైకల్యం, ఇటు మానసిక దౌర్బల్యం అనుక్షణం వేధిస్తున్నప్పటికీ ఆత్మవిశ్వాసమే ఆయుధంగా విశ్వవేదికపై నిలిచి విజయ పతకాలు సాధించి భారత కీర్తిపతాకాన్ని సగర్వంగా ఎగురవేసిన మన ప్యారా అథ్లెట్లకు జేజేలు!... శుభాకాంక్షలు!!

# శవరాజకీయాలు చేస్తున్న జగన్ మీడియా!

ఇటీవల విజయవాడని ముంచెత్తిన వరదలని సైతం వైసీపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూడడం సిగ్గుచేటైన విషయం. ముఖ్యంగా మూడు నెలలక్రితం వరకూ అధికారం వెలగబెట్టిన వైసీపీ అధినేత తన స్థాయి మరచి విమర్శలు చేయడం హేయనీయం. తమ బ్రతుకులు గంగపాలై అల్లాడుతున్న ప్రజలు ఓ వైపు, వారిని అన్ని విధాలా ఆదుకోవడానికి ప్రభుత్వం పడుతున్న తపన మరోవైపు మనం చూస్తూనేవున్నాం. జగన్ సొంత మీడియాలో శవాలని, శోకాలని మాత్రం చూపిస్తూ ఇక్కడకూడా రాజకీయ లబ్ధిపొందాలని చూడడం అమానవీయం. జగన్ పార్టీలోని వారంతా కోట్లకి పడగలెత్తిన వారే. అంతా గత ప్రభుత్వహయాంలో దొరికినమేరకి దోచుకున్నవారే. చేతనైతే వాళ్లందరినీ పురమాయించి వరదభాదితులకి ఆర్థిక సహాయం చేయించాలి, అంతేతప్ప ఇలా చేతిలో సొంత మీడియా వుంది కదా అని శవరాజకీయాలు చేయడం మంచిదికాదు!

**కే. విజయకుమార్, నెల్లూరు.**

# కుక్కలు బాబోయ్ కుక్కలు!

నగరంలో కుక్కల బెడద ఎక్కువైపోయింది. ఒంటరిగా నడవాలంటే వణుకు పుడుతోంది. ముఖ్యంగా పసిబిడ్డలతో బయటకి వెళ్లాలంటే భయమేస్తోంది. ప్రతిచోటా కుక్కలు సమూహంగా ఉంటున్నాయి. మూకుమ్మడిగా పైన పడుతున్నాయి. ఇటీవల బాలాజీనగర్‌కి చెందిన రాజకీయ నాయకులు 'కుక్కల బారినుండి కాపాడండి' అంటూ నగర కార్పొరేషన్ అధికారులకి లిఖితపూర్వక విన్నపం కూడా ఇచ్చారు. ఒక్క బాలాజీనగర్లోనే కాదు, నెల్లూరు టౌనంతా ఇదే పరిస్థితి. మాగుంట లేఅవుట్, గోమతినగర్, ఇస్కాన్ సిటీ, హరనాధపురం, స్టోన్‌హౌస్‌పేట, నవాబ్‌పేట, సంతపేట, ములాప్పేట, ఫతేఖాన్‌పేట, లేక్‌వ్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, ఎన్.జి.ఓ కాలనీ, మిలిటరీ కాలనీ, వేదాయపాళెం, కొండాయపాళెం, బట్వాడపాళెం, భక్తవత్సలనగర్, ఏకే నగర్, శాంతినగర్, అరవిందనగర్, ఆదిత్యనగర్, జగదీష్‌నగర్ లాంటి అనేక ప్రాంతాలలో ఈ కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

**– బి. చంద్రశేఖర్‌రెడ్డి, టెక్కామిట్ట.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# హడలెత్తిస్తున్న వైరల్ జ్వరాలు

జిల్లాలోని అనేకప్రాంతాల్లో వైరల్ జ్వరాలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి కేసులు పెరుగుతుండడంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న ఈ వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన వైద్యాశాఖ వారు నామమాత్రంగా పర్యటనలతోనే సరిపెట్టుకుంటున్నారు. ఉన్నట్లుండి జ్వరం, వళ్లునొప్పులు రావడం, తగ్గిపోతుందిలే అనుకునేసరికల్లా ప్లేట్‌లెట్స్ పడిపోవడం తరచూ జరుగుతోంది. పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకు ఇంటిల్లిపాదీ వైరల్ జ్వరాలు జిల్లా అంతటా ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఈ పరిస్థితులను సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలి.

**– వై. కుమార్, బుచ్చిరెడ్డిపాళెం.**

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 55

## వ్యక్తిగత జీవితాలని రచ్చకీడుస్తున్న

# రహస్య కెమెరాలు!

నేటి ఆధునిక కాలం.. ఒక భయంకర అంతర్జాల మాయాజాలంగా మారింది. అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చి, అరచేతి వేళ్లలోకి ప్రపంచపు లోగిళ్ళు వచ్చేశాయి. ఏది కావాలంటే అది క్షణాల్లో కళ్లముందు కనిపించే 'మాయా దర్పణం' ముందు ప్రపంచమే సాగిలబడిపోయింది.

ఇదే సమయంలో, అనేక సాంకేతిక సాధనాలు కూడా చాలా చవగ్గా మార్కెట్లో దొరుకుతుండడంతో, అశ్లీలాలకి, అకృత్యాలకి, అరాచాలకి ఆగడాలకి అడ్డు, అదుపు లేకుండాపోయింది. దొంగలు, నేరస్తులు, హంతకులు, అవినీతిపరులు వంటి రకరకాల మోసగాళ్లను పట్టుకోవడానికి ఉపయోగపడే రహస్య కెమెరాలు సామాన్య ప్రజల జీవితాలలోకి కూడా తొంగి చూస్తున్నాయి.

బెడ్‌రూముల్లో, బాత్రూముల్లో సైతం ప్రత్యక్షమై మనుషుల వ్యక్తిగత స్వేచ్ఛకి, భద్రతకి అటంకం కలిగిస్తూ మనిషి మనుగడకే ప్రమాదకరంగా మారాయి.

చిన్నపిల్లలు కూడా సెల్‌ఫోన్లలో మాటలు రికార్డు చేయడం, వీడియోలు తీయడం అలవాటు చేసుకుంటున్న తరుణంలో, ఎదుటివారికి తెలియకుండా వారి ఆంతరంగిక విషయాలలోకి తొంగి చూడగలిగే 'రహస్య కెమెరాలు' ఇప్పుడు ప్రపంచమంతా విరివిగా అందుబాటులోకి వచ్చేశాయి.

చొక్కా గుండీ సైజులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్న ఈ రహస్య కెమెరాలలో దృశ్యం, శబ్దం రెండూ స్పష్టంగా కనిపించి, వినిపిస్తాయి.

ఈ కెమెరాల సహాయంతో చిత్రీకరించే అశ్లీలం.. ఓ పెద్ద మురుగు కాలువలా దేశమంతటా ప్రవహిస్తూనే ఉంది.

సంఘ విద్రోహులు ఈ కెమెరాలని బాగా వాడుకుంటున్నారు. ఎక్కడ వీలయితే అక్కడ రహస్య కెమెరాలు అమరుస్తున్నారు. ముఖ్యంగా యువతులు, మహిళల ప్రైవేట్ వీడియోలు తీసి, వారిని భయపెట్టి డబ్బులు గుంజుతున్నారు. వాటిని ఇతరులకు షేర్‌చేసి పైశాచికానందం పొందడం వంటి వికృత చర్యలకి పాల్పడుతున్నారు.

నిజానికి ఇప్పుడు ఇదొక పెద్ద వ్యాపారమైపోయింది. రహస్య కెమెరాల ద్వారా చిత్రీకరించిన వీడియోలను అడ్డంపెట్టుకుని పచ్చని సంసారాలని నాశనం చేస్తున్న ఎన్నో సంఘటనలు గురించి మనం తరచూ వింటూనే వున్నాం, వార్తలలో చూస్తూనే వున్నాం.

సమాజంలో ఉన్నతస్థానంలో ఉన్న కుటుంబాల వారు సైతం ఈ కెమెరాలని అడ్డంపెట్టుకుని మహిళల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. వాటిని బయటకు చెప్పుకోలేక లోలోపలే బాధలు పడుతున్నవారు కోకొల్లలుగానే ఉంటున్నారు. ఈ పైశాచిక మృగాల బారినపడి, విలవిలలాడుతున్న ఎంతో మంది మహిళలు, విద్యార్థినుల ఆత్మఘోష వర్ణనాతీతం.

## మీడియా నుండి మాఫియా వరకు!

నిజానికి ఈ హిడెన్ కెమెరా అన్నది 1922లోనే అందుబాటులోకి వచ్చింది. సాధారణ కెమెరాని 1816లో కనిపెడితే ఆ తరువాత వందేళ్లకి రహస్య కెమెరా పుట్టింది. ప్రపంచ దేశాలలో అక్కడక్కడా ఈ హిడెన్ కెమెరాల ప్రయోగం ఉన్నప్పటికీ మన దేశంలో మాత్రం 2001 తరువాత ఈ రహస్య కెమెరా బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది.

అప్పట్లో ఎన్డీఏ భాగస్వామ్యంతో వాజపేయి నాయకత్వంలో కేంద్రం అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వం చేసిన ఆయుధాల కుంభకోణాన్ని తెహెల్కా అన్న మీడియా ద్వారా ఆ సంస్థ సారథి తరుణ్‌తేజ్ పాల్ బట్టబయలు చేశారు. రహస్య కెమెరా ద్వారా స్టింగ్ ఆపరేషన్ చేసిన తొలి మీడియా సంస్థగా భారతదేశంలో "తెహెల్కా" సంచలనాత్మకంగా అవతరించింది.

భారతదేశంలో అలా మొదలైన రహస్య కెమెరాల కథ "ఇంతింతై.. వటుడింతై.. దానింతై.. నభోవీథిపైనంతై" అన్నట్లుగా విస్తృతంగా విస్తరించి అత్యంత ప్రమాద కరంగా తయారయ్యింది.

కొన్ని టీవీ ఛానెళ్ళు ఈ రహస్య కెమెరాలతో రియాలిటీ షోలని ప్రారంభించి వాటి ద్వారా కోట్లు గడించాయి. న్యూస్ ఛానెళ్ళు సైతం హిడెన్ కెమెరాల సాయంతో, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, సెలెబ్రిటీల అవినీతి బండారాలని, అక్రమ సంబంధాలని బయటపెట్టడం ప్రారంభించాయి.

ప్రస్తుత సమాజంలో గుడి, బడి అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ వాటిని అమర్చేస్తున్నారు.

వ్యక్తగత స్వార్ధంతో, సంపాదనపై వ్యామోహంతో కొంతమంది వాటిని వాడుకుంటుంటే, మానసిక రుగ్మతతో శాడిస్టులుగా మారిన మరికొందరు ఈ రహస్య కెమెరాలద్వారా తమకి కావలసిన వీడియోలను చిత్రీకరించుకుని, వాటిని చూసుకోవడం ద్వారా మానసిక ఆనందం పొందుతున్నారు.

ఈ రహస్య కెమెరాలు మీడియా చేతినుండి క్రమేణా మాఫియా చేతుల్లోకి వెళ్లాయి. భద్రంగా ఉండాల్సిన లక్షలాదిమంది బ్రతుకులని ఛిద్రం చేస్తున్నాయి.

## కట్టడిచేయకుంటే కష్టమే!

రహస్య కెమెరాల అకృత్యాలకు అంతే ఉండడం లేదు. 'దొరికితే దొంగ-లేకుంటే దొర' అన్నట్లుగా పరిస్థితులు తయారయ్యాయి. ఎవరికి తోచిన విధంగా వారు ఈ సీక్రెట్ కెమెరాలను తమ సొంత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారు. అయినా అడిగే నాథులు లేరు, ప్రశ్నించే ప్రభుత్వాలు లేవు. ఈ రహస్య కెమెరాలపై స్పష్టమైన చట్టాలు లేవు. నిర్దిష్టమైన నియంత్రణ లేదు. వీటిని అవకాశంగా తీసుకుని లైంగిక ఉన్మాదులు రెచ్చిపోతున్నారు. తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ మహిళల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఈ కెమెరాల పుణ్యమా అని మహిళల మాన ప్రాణాలకు భద్రత లేని దుస్థితి వచ్చింది.

ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్ళు తెరవాలి. ఈ రహస్య కెమెరాల వాడుకపై కఠినమైన చట్టాలు తేవాలి. బహిరంగ మార్కెట్లో వాటి అమ్మకాలని నిషేధించాలి. ఆన్‌లైన్ ద్వారా రహస్య కెమెరాలని విక్రయించకూడదన్న నిబంధన తేవాలి. హిడెన్ కెమెరాలు వాడాలంటే ప్రభుత్వాల నుండి ఖచ్చితమైన అనుమతులు తీసుకోవాలన్న చట్టం తేవాలి.

ఈ విషసంస్కృతి నుంచి తప్పించుకునేందుకు సామాన్య ప్రజలు కూడా ఎవరికి వారు అప్రమత్తంగా వ్యవహరించాలి. తమ చుట్టూ ఏం జరుగుతోందో గమనించుకోవాలి. ముఖ్యంగా కొత్త ప్రదేశాలకి వెళ్ళినప్పుడు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు కలసికట్టుగా కట్టడి చేయకపోతే ఈ 'రహస్య కళ్ళ'తో కష్టాలు తప్పవు. తస్మాత్ జాగ్రత్త!

**- రాజశ్రీ**

# టీడీపీ నేతలపై.. వైసీపీ విమర్శలు సిగ్గుచేటు

**• బీద రవిచంద్ర ధ్వజం**



విజయవాడ వరదబాధితులను ఏమాత్రం ఆదుకోకుండా, బాధితులకు అండగా అహర్నిశలు సేవలందిస్తున్న టీడీపీ నేతలపై మాజీ ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తుండడం సిగ్గుచేటని టీడీపీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కష్టపడుతుంటే సహించలేని వైసీపీ నాయకులు కొందరు పనిగట్టుకుని ముఖ్యమంత్రిపై అర్ధరహితమైన ఆరోపణలు చేస్తుండడం విచారకరమన్నారు. కృష్ణానదిపై రక్షిత గోడ 1వదశ నిర్మాణాన్ని తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిచేసిందని, అయితే దానిని తామే కట్టినట్లు వైసీపీ అసత్యపు ప్రచారాలు చేసుకుంటూ ఆ గోడవద్ద ఫోటోలు దిగుతుండడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా, ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా వరద బాధితులకు డ్రోన్‌ల ద్వారా ఆహారపొట్లాలు అందించి ఆదుకున్నది ఒక్క చంద్రబాబు నాయుడేనని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారని ఆయన తెలిపారు. విపత్తులను ఎదుర్కోవడంలో చంద్రబాబు నాయుడు దేశానికే ఒక రోల్‌మోడల్ అన్నారు. స్ఫూర్తిదాయకమైన ఆయన సేవలు అందరికీ మార్గదర్శకమన్నారు. నెల్లూరు జిల్లాలో సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణపు పనులు పూర్తిస్థాయిలో పూర్తికాక ముందే వైసీపీ నాయకులు ఆ బ్యారేజీలకు తమ పేర్లు పెట్టుకోవడం ఏమిటని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, రాజానాయుడు, పనబాక భూలక్ష్మి, హరిబాబు, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సహాయక చర్యల్లో ఉదయగిరి ఎమ్మెల్యే

**చేయి చేయి కలిపి విపత్తును ఎదుర్కోందామంటున్న కాకర్ల**



వరద బాధితులను అన్నివిధాలా ఆదుకునేందుకు కలసికట్టుగా శ్రమించాలని, చేయిచేయి కలిపి విపత్తును ఎదుర్కొందామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలసి ఆయన విజయవాడలోని 7వ డివిజన్‌లో వరద బాధితులకు సాయమందిస్తున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ ముంపు బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తూ, జరిగిన నష్టాన్ని వారు పరిశీలిస్తూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. జరిగిన నష్టం అంచనాలకు అందేవిధంగా లేదని, కట్టుబట్టలతో సహా సర్వస్వం కోల్పోయిన బాధితులకు విరాళాల ద్వారా దాతలు సహాయమందించాలని ఎమ్మెల్యే కాకర్ల కోరారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న విజయవాడ ప్రజల కష్టాలు తీరాలంటే ఎన్నేళ్ళు పడుతుందో చెప్పలేమన్నారు. విపత్తును ఎదుర్కొనేందుకు సీఎం చంద్రబాబునాయుడు రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. మాలేపాటి చైతన్య, కనకదుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

### కాకాణి అలసత్వంతోనే..

# నేలటూరు ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం

**త్వరితగతిన పనులు పూర్తిచేయిస్తామన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి**



మాజీ మంత్రి కాకాణి అలసత్వంతోనే నేలటూరు కాలనీల నిర్మాణాల్లో జాప్యం జరిగిందని, వైకాపా పాలనలో ఒక్కరోజైనా ఆ కాలనీల నిర్మాణాల వైపు చూసే తీరిక ఆయనకు లేకపోవడం విచారకరమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరు, ధనలక్ష్మీపురం ప్రాంతంలో నేలటూరు వాసుల కోసం చేపట్టిన ఇళ్ల కాలనీల నిర్మాణాలను ఆయన ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి అధికారులతో ఆ నిర్మాణాలను పూర్తిచేయించే విషయమై చర్చించారు. ఇళ్ల నిర్మాణాల్లో వినియోగించే స్టీల్ నాణ్యతగా ఉండాలని, పనులు క్రమబద్ధంగా చేయించాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు ఆధారిత పవర్ ప్రాజెక్టుల కారణంగా వెదజల్లుతున్న కాలుష్యంతో నేలటూరు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, అందుకు ప్రత్యామ్నాయంగా నేలటూరు గ్రామస్తులకు మాదరాజుగూడూరు వద్ద 309 ఇళ్లు, నేలటూరుపాళెం వాసులకు ధనలక్ష్మీపురం వద్ద 171 ఇళ్ల నిర్మాణానికి 2018 అక్టోబర్‌లో శంకుస్థాపన చేశామని, మాదరాజుగూడూరు వద్ద ఒక్కో ఇంటి నిర్మాణానికి 30 అంకణాలు, ధనలక్ష్మీపురం వద్ద 25 అంకణాల స్థలం కేటాయించామని ఆయన చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సాఫీగా సాగిన పనులను వైసీపీ అధికారంలోకి రాగానే ఆపేందుకు వారికి మనసెలా వచ్చిందోనని, ఇప్పుడు మళ్లీ టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పనులన్నీ చేపడుతున్నామన్నారు. ఒక్కో ఇంటిని రూ.17 లక్షలు వెచ్చించి 9.7 అంకణాల కట్టుబడి చేసేలా నిధులు మంజూరు చేశామని, కట్టుబడికి రూ.102 కోట్లు వెచ్చిస్తున్నామని, ఆ ఇళ్ల స్థలాల విలువ రూ.220 కోట్లు వరకు ఉంటుందని, మొత్తంగా రూ.320 కోట్ల విలువైన కాలనీలను నేలటూరు ప్రజలకు అందించబోతున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మాణ నాణ్యత విషయంలోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం, ఇరిగేషన్ పనుల విషయంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ కోరామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మంత్రి కాకాణి దొరికినంతమేరకు ప్రజల సొత్తును దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. ఇప్పుడిప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో వ్యవస్థలు గాడిన పడుతున్నాయని, నేలటూరు వాసులకు మంచి ఇళ్లు త్వరలోనే వస్తాయని ఆయన భరోసా ఇచ్చారు.

### డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్

# సేవలు అభినందనీయం

**• ప్రశంసించిన కలెక్టర్ ఆనంద్**



ప్రముఖ డాక్టర్ బిందుమీనన్ ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేస్తున్న వైద్యసేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆనంద్ కొనియాడారు. బిందుమీనన్ ఫౌండేషన్ ఏర్పాటుచేసి 11 సంవత్సరాలు పూర్తయి, 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, స్థానిక రామమూర్తినగర్‌లో జరిగిన వార్షికోత్సవ సంబరాల్లో కలెక్టర్ పాల్గొని, పోస్టర్లను ఆవిష్కరించి, ఉచిత న్యూరాలజీ వైద్యశిబిరానికి ప్రారంభోత్సవం చేశారు. పలువురు రోగులకు ఉచితంగా మందుల కిట్‌లను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, 'న్యూరాలజీ ఆన్ వీల్స్' అనే ప్రత్యేకమైన వాహనంలో వైద్యబృందాలను ఏర్పాటుచేసి, ప్రజలకు ఉచితవైద్యం అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఆమె చేస్తున్న ఉచిత సేవలే ఆమెకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చాయన్నారు. డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ, నరాలకు సంబంధించిన సమస్యలు, వ్యాధుల నివారణకు తమ ఫౌండేషన్ విశేషంగా కృషిచేస్తోందని, ఇప్పటి దాకా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 250 ఉచిత వైద్యశిబిరాలను, 248 అవగాహనా సదస్సులను ఏర్పాటుచేశామని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఫిట్స్, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి వ్యాధులకు సంబంధించి అవగాహన కలిగించేందుకు న్యూరాలజికల్ మొబైల్ యాప్‌లు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ కెఎంఆర్ నంబియార్, వైస్ ఛైర్‌పర్సన్ భార్గవి నంబియార్‌లు ఈ సేవాకార్యక్రమాల్లో తమనెంతో ప్రోత్సహిస్తున్నారంటూ ఆమె ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.





### గురునిలయంలో...

# వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు మూలాపేటలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి గురునిలయంలో ఈ నెల 9న స్వామివారి 42వ ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. వెంకయ్యస్వామితో పాటు, స్వామివారి పాదరేణువు మాకాని వెంకట్రావు స్వామి విగ్రహానికి కూడా ఘనంగా పూజలు, అభిషేకాలు చేశారు. గురునిలయం సేవకులు మాకాని గోపీచంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆరాధనోత్సవంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మాకాని చంద్ర, గాలిపాళెం ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరిస్వామి, వెంకయ్యస్వామి ప్రియశిష్యులు తుమ్మలతలుపూరు శ్రీ నారాయణదాసు స్వామి, పారిశ్రామికవేత్త పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం జరిగిన వెంకయ్యస్వామివారి నగరోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విఘ్నేశ్వరుడి దయతో..

# విఘ్నాలన్నీ తొలగిపోవాలి

**కోవూరు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



విఘ్నేశ్వరుడి దయతో విఘ్నాలన్నీ తొలగిపోవాలని, కోవూరు నియోజకవర్గం ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని బజారు సెంటర్లో టీఎన్‌సి యూత్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలలో ఆమె పాల్గొని విఘ్నేశ్వరుడికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత 24 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా వినాయక చతుర్థి ఉత్సవాలు నిర్వహిస్తున్న టీఎన్‌సి యూత్ సభ్యులను అభినందించారు. ఈ ఉత్సవ బాధ్యతలు చేపట్టే యువకులు ఏడాది లోపే ఉద్యోగ వ్యాపారాలలో స్థిరపడే ఆనవాయితీ కొనసాగుతుందన్నారు. ఈ సంవత్సరం ఉత్సవాలు నిర్వహిస్తున్న యువకులు వచ్చే ఏడాదికల్లా స్వామివారి ఆశీస్సులతో ఉద్యోగ వ్యాపారాలలో స్థిరపడాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు ఆమెను ఘనంగా సన్మానించారు. లేగుంటపాడు సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు గాదిరాజు అశోక్ పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## రాణాప్రతాప్ యువసేన సేవలు మరువలేనివి



రాణా ప్రతాప్ యువసేన సేవలు మరువలేనివని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరులోని చిన్నబజార్‌లో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాణాప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో గత 34 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈసారి ఇక్కడ 23 అడుగుల వినాయక విగ్రహం ఏర్పాటు చేయడం బాగా ఆకట్టుకుంటోందన్నారు. రాణాప్రతాప్ యువసేన, జయభారత్ హాస్పిటల్ వారి సహకారంతో గత 7 సంవత్సరాలుగా పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని, బాల సంస్కార్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా వారు చేపట్టినట్లు వివరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేదీన రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆర్‌ఎస్ఎస్ నాయకులు లక్ష రూపాయల విరాళాన్ని ఎంపీ వేమిరెడ్డికి అందజేశారు.

## ఎన్జీఓల విరాళం.. లక్షా నూటపదహార్లు



విజయవాడ వరదబాధితుల సహాయార్థం జిల్లా ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో లక్షా నూటపదహారు రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేశారు. ఈనెల 9న ఆ చెక్కును జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. వరద బాధితులకు సహాయం చేసిన ఎన్జీఓల సంఘం నాయకులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షులు ఎన్. ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మధు, సంయుక్త కార్యదర్శులు ఇ.విజయ కుమార్, ఎల్.పెంచలయ్య, జి.సువర్ణ, రాష్ట్ర మహిళా కో-ఛైర్‌పర్సన్ స్వర్ణలత, జిల్లా మహిళా ఛైర్‌పర్సన్ యు.చిన్నమ్మ, రాపూరు తాలుకా అధ్యక్షులు టి. మల్లికార్జున, నెల్లూరు నగర కోశాధికారి సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జనార్దన్, నగర ఉపాధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## పర్వతరెడ్డి విరాళం.. లక్షా 75వేలు

వైకాపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయవాడ వరద బాధితులకు సాయంగా ఒక నెల వేతనం లక్షా 75వేల రూపాయలను తన విరాళంగా అందజేశారు. ఆమేరకు చెక్కును వైయస్సార్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీకి పంపారు.

## వరదబాధితులకు.. నిఖిల్ 5 లక్షల విరాళం

- మాగుంట శీనయ్య చిన్నకుమారుని ఔదార్యం



విజయవాడ వరద బాధితులకు మాగుంట కుటుంబం బాసటగా నిలిచింది. ఇటీవలే ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తమ కుటుంబం పక్షాన బాధితులను ఆదుకునేందుకు కోటీ యాభై లక్షల రూపాయలను విరాళంగా ప్రకటించడం, తన సోదరుడు దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి అల్లుడు ఆనం శివకుమార్‌రెడ్డితో కలసి విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆ విరాళం చెక్కును అందజేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాగుంట శ్రీనివాసులురెడ్డి చిన్నకుమారుడు మాగుంట నిఖిల్‌రెడ్డి కూడా స్పందించి, బాధితులకు అండగా నిలిచారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను ఆయన ఇటీవల కలిసి వరద బాధితుల సహాయార్థం 5 లక్షల రూపాయలను విరాళంగా అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నిఖిల్‌ను కలెక్టర్ అభినందించారు.

## విపిఆర్ కన్వెన్షన్‌లో వినాయకచవితి సంబరాలు



వినాయకచవితిని పురస్కరించుకుని నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్‌లో వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. విపిఆర్ కన్వెన్షన్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం సిబ్బందికి స్వయంగా అన్న ప్రసాదాలు అందజేశారు.

## డా.కిషోర్స్ రత్నంలో..చవితి సంబరాలు



నెల్లూరులోని సరస్వతీనగర్‌లో ఉన్న డా. కిషోర్స్ రత్నం విద్యాసంస్థల్లో ఇటీవల వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు మట్టిగణపతి విగ్రహాలకు పూజలు చేశారు. బంకమట్టి, పసుపు, గోధుమపిండి, నవధాన్యాలతో గణపతులను రూపుదిద్ది, పూలతో అలంకరించి పూజించారు. డా.కిషోర్స్ రత్నం టెక్నో స్కూల్, రేస్ ఇంటర్నేషనల్, మెడికల్ ఒలంపియాడ్ స్కూల్స్‌లోని సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో...



### ఏసీ కూరగాయల మార్కెట్ నుంచి..

## విజయవాడకు 30 టన్నుల కూరగాయలు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 టన్నుల కూరగాయలను పంపించారు. ఈనెల 10న నెల్లూరు నుంచి బయలుదేరుతున్న ఆ వాహనాలకు శ్రీధర్‌రెడ్డి జెండా ఊపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద బాధితుల కోసం ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌వారు పెద్దమొత్తంలో కూరగాయలు పంపడం అభినందనీయమన్నారు. వరద సహాయక చర్యల్లో 74 ఏళ్ల వయసులో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పనిచేయడం అద్భుతమన్నారు. ఆ స్ఫూర్తితో ఎందరో దాతలు వరదబాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తుండడం సంతోషకరమన్నారు. మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనితకుమారి, కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, హార్టీకల్చర్ ఏ.డి సుబ్బారెడ్డి, ఏసీ కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు రామయ్య, లక్ష్మయ్య, షేక్ అజీజ్, ఎం.నాగేశ్వరరావు, తాతిరెడ్డి, జనార్దన్, సురేష్, లక్ష్మణ్, గయాజుద్దీన్, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

## రవాణాశాఖలో ఇద్దరికి..ఆర్టీఓలుగా పదోన్నతి

- ఘనంగా సన్మానించిన డీటీసీ చందర్



జిల్లా రవాణాశాఖలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులకు ఇటీవల ఆర్టీఓలుగా పదోన్నతి లభించింది. ఆ మేరకు రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీచేశారు. నెల్లూరు కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న కిశోర్ గూడూరు ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టీఓ)గా, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న మురళీమోహన్ తిరుపతి ప్రాంతీయ రవాణా అధికారిగా నియమితులయ్యారు. వీరిద్దరూ ఇక్కడ రిలీవ్ అయిన సందర్భంగా ఈనెల 9న జిల్లా ఉప రవాణా కార్యాలయంలో ఉప రవాణా కమిషనర్ బి.చందర్ వారిని అభినందించి, శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్, బాబు, ఏఎంవీఐలు స్వప్నిల్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, రంగనాథరెడ్డి, ఏఓ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## విరాళం చెక్కును.. అందజేసిన గిరిధర్‌రెడ్డి



విజయవాడ వరద బాధితుల సహాయార్థం తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఈనెల 10న జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు 3లక్షల 500 రూపాయల చెక్కును అందజేశారు. 20వ డివిజన్ ఇస్కాన్‌సిటీకి చెందిన పమిడి శ్రీనివాసులు, వారి కుమారులు మోహిత్ ఈశ్వర్, చరిత్‌బాబు లక్ష రూపాయలు, నెల్లూరు హోటల్స్ అసోసియేషన్ వారు లక్షా 500 రూపాయలు, నెల్లూరు రూరల్‌లోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌వారు లక్ష రూపాయల వంతున ఇచ్చిన ఆ విరాళాన్ని ఆయన కలెక్టర్‌కు అందించారు. క్లస్టర్ ఇన్‌చార్జి మన్నేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.




## బాలాజీ ఏజెన్సీ.. 3 లక్షల వితరణ



నెల్లూరులోని మహీంద్ర అండ్ మహీంద్ర కార్ల షోరూమ్ (శ్రీ బాలాజీ ఏజెన్సీస్) వారు విజయవాడ వరద బాధితుల కోసం ఈనెల 10న 3 లక్షల రూపాయలను వితరణగా అందజేశారు. షోరూమ్‌లో పనిచేసే ఉద్యోగ కార్మికులు ఒకరోజు జీతంతో పాటు మరికొంత నగదును చేర్చి మొత్తంగా 3లక్షలను జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు అందించారు. షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ నరేంద్రనాథ్, ఆడిటర్ ముని, వెంకటసతీష్‌లను కలెక్టర్ అభినందించారు.



## ఎమ్మెల్యే సోమిరెడ్డి సారధ్యంలో..

# వరద బాధితులకు అండగా నిలిచిన సర్వేపల్లి కంపెనీలు

- రూ. 2 కోట్లు ఇచ్చిన జెమినీ ఎడిబుల్ ఆయిల్ కంపెనీ
- రూ. 50 లక్షలు అందజేసిన 'సెంబ్ కార్ప్' ఎస్ఈఐఎల్ ఎనర్జీ
- అన్ని కంపెనీలతో కలిపి రూ. 2.97 కోట్ల విరాళం

విజయవాడ వరదబాధితుల సహాయార్థం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 11న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సర్వేపల్లి నియోజక వర్గంలో ఉన్న పలు కంపెనీల ప్రతినిధులు రూ.2.97కోట్ల రూపాయల విరాళాల చెక్కులను అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినం దించారు. ప్రజల బాధలు, సీఎం చంద్రబాబునాయుడు పడుతున్న కష్టం చూసి చలించి ముందుకొచ్చి సాయమందించిన దాతలకు సోమిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వరదల విపత్తుల్లో కష్టాలు పడుతున్న బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. జెమిని ఎడిబుల్ ఆయిల్ కంపెనీ వారు రూ.2 కోట్లు, సెంబ్ కార్ప్(ఎస్ఈఐఎల్ ఎనర్జీ) కంపెనీ వారు రూ.50 లక్షలు, మిగిలిన పామాయిల్ కంపెనీలన్నీ కలిపి మరో రూ.47 లక్షలు అందించారని అంటూ, ఆయా కంపెనీల ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి విపత్తు గతంలో ఎప్పుడూ సంభవించలేదని, సుమారు రూ.6800 కోట్లకు పైగా నష్టం సంభవించిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఉదారంగా నిధులిచ్చి బాధితులను ఆదుకుంటుందని ఆశిస్తున్నామన్నారు. దేశం నలుమూలల నుంచి దాతలు ముందు కొచ్చి బాధితులకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జెమిని ఎడిబుల్ ఆయిల్ కంపెనీ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ కుమార్‌చౌదరి, సేల్స్ హెడ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఇఎల్ ఎనర్జీ ఇండియా ప్రతినిధులు బ్రిగేడియర్ జీఎన్ రఘురామ్, సిఎస్ఆర్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌లో 'లంబోదర వినాయకుడు'

**పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**





వినాయకచవితి సందర్భంగా నెల్లూరు, మాగుంట లేఅవుట్ లోని డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి సర్కిల్‌లో లంబోదర వినా యకుని ఏర్పాటు చేసి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి గణేశుని దర్శించుకున్నారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లా డుతూ, నెల్లూరుజిల్లా ప్రజలకు వినాయకుని ఆశీస్సులు ఉండా లని, అంతా మంచే జరగాలని కోరుకుంటున్నామన్నారు. ఈ వేడుకల్లో డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయ కులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సింహపురి గణేష్ ఉత్సవ సమితి వేడుకల్లో :

నెల్లూరులోని సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శివాజీ సెంటర్‌లో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ నాయకులు సురేందర్‌రెడ్డి, కమిటీ నాయకులు భాస్కర్, సుబ్రహ్మణ్యం, రంగరాజన్ తదితరులు స్వాగతం పలికారు.

### జ్యోతి వినాయక స్వామి ఆలయంలోపూజలు

నగరంలోని టౌన్‌హాలు వద్ద ఉన్న శ్రీ జ్యోతి వినాయకస్వామి మందిరంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంప తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పూలంగి సేవ నిర్వహించిన వేమిరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు.

# ఆలిండియా సైనిక్ శిబిరంలో ఎన్‌బికెఆర్ విద్యార్థికి కాంస్య పతకం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ (ఇసిఇ విభాగం) మూడో సంవత్సరం చదువు తున్న బోయిళ్ళ మహీధర్‌రెడ్డి ఎన్‌సిసి నావెల్ వింగ్‌లో ఉన్నత మైన ఆలిండియా సైనిక్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల ఆ క్యాంపులో పాల్గొని తన ప్రతిభతో "హెల్త్ అండ్ హైజీన్" పోటీలో కాంస్య పతకం సాధించి తన సత్తా చాటుకున్నాడు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ డా. విజయ కుమార్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డా. జి.హరినాథరెడ్డి, కళాశాల నావెల్ ఎన్‌సిసి అధికారి డా. వి.మల్లిఖార్జునరెడ్డి ఈ నెల 10న కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థిని అభినందించారు.

## కోటి విరాళం అందించినందుకు లేఖ ద్వారా...

# వేమిరెడ్డికి.. ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

మనసున్న మహాదాత, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఇటీవల భారీ వరదలతో అతలాకుతలమై అల్లాడుతున్న బాధితుల సహాయార్థం కోటి రూపాయల విరాళం అందించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి వారు ఆ విరాళం చెక్కును అందించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వేమిరెడ్డిని అభినందిస్తూ ఈనెల 8న ఓ లేఖను విడుదల చేశారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందించిన సహాయం రాష్ట్ర పునరుద్ధరణకు, ముఖ్యంగా వరద బాధితులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి మీరు అందించిన ఉదార సహకారాన్ని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానన్నారు. కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా ప్రజలు భారీ వరదలతో తీవ్రంగా నష్టపోయారని, మీరు అందించిన విరాళం బాధితులకు ఎంతో ఉపయోగపడుతుందని, అందుకు మీకు ధన్యవాదాలని ఆ లేఖలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుంది

- బాధితులకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ భరోసా



విజయవాడలో ఇటీవల వచ్చిన వరదలకు జనజీవనం అస్తవ్యస్తమైన నేపథ్యంలో వరదబాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 9న విజయవాడ నగరంలో పర్యటించి బాధితులకు అండగా నిలిచారు. విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలోని 54వ డివిజన్ పరిధిలోని వించ్‌పేట, మహంతిపురం, గాంధీబొమ్మ ప్రాంతాల్లో పర్యటించి బాధితులను ఊరడించారు. వారికి ప్రభుత్వం సమకూర్చిన నిత్యావసర సరుకులను అందించారు. కూరగాయలు, పండ్లు, మెడిసిన్స్, పాలు పంపిణీ చేశారు. వరదల వల్ల నష్టపోయిన బాధితులకు సీఎం చంద్రబాబునాయుడు సారధ్యంలో ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని ఆమె బాధితులకు భరోసా ఇచ్చారు.

# కోడూరులో శిథిలమవుతున్న పశువైద్యశాల

- కొత్తది నిర్మించాలని కోరుతున్నరైతులు

తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరులో ఉన్న పశువైద్యశాల ఎప్పుడో పాతకాలం నాటిది. ఇప్పుడది పూర్తిస్థాయిలో శిథిలం కావడంతో వర్షాలొస్తే లోపలున్న మందులన్నీ తడిసిపోయి, పాడైపోతున్నాయి. అందులోనూ దీనికి ప్రహరీ గోడ లేకపోవడంతో భద్రత లేకుండాపోయింది. కోడూరు పంచాయతీ పరిధిలోని 13 గ్రామాలకు ఇదొక్కటే పశువైద్యశాల కావడంతో, నిత్యం రైతులు పశువులను ఇక్కడకి చికిత్సలకు తీసుకువస్తుంటారు. ఈ నేపథ్యంలో, శిథిలమైపోయిన పాతభవనం స్థానంలో కొత్తదాన్ని నిర్మించాలని, పశువుల చికిత్సలకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.




# పల్లిపాడు గాంధీజీ ఆశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్



ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని గాంధీ ఆశ్రమాన్ని తొలిసారిగా జిల్లా కలెక్టర్ ఆనంద్ ఈనెల 10వ తేదీ ఉదయం సందర్శించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత గోశాలను, అతిథిగృహాన్ని పరిశీలించారు. గోశాలలో గోవులకు మేత తినిపించారు. గాంధీజీ ఫోటోఎగ్జిబిషన్ కేంద్రాన్ని పరిశీలించి, గాంధీజీకి ఈ ఆశ్రమానికి ఉన్న అనుబంధాన్ని తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఆశ్రమాన్ని పర్యాటకంగా కూడా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కలెక్టర్‌ను కలిసిన పలువురు రైతులు, వరదల సమయంలో ఆశ్రమానికి రక్షణగా పెన్నానది ఒడ్డున రిటైనింగ్ వాల్ లేదా రాళ్లతో కట్టలు నిర్మించాలని కోరారు. అలాగే పోర్లుకట్ల నుంచి ఆశ్రమానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరగా కలెక్టర్ అందుకు సానుకూలంగా స్పందించారు. తొలుత, కలెక్టర్‌ను ఆశ్రమ నిర్వాహకులు సాదరంగా స్వాగతించారు. కలెక్టర్ వెంట గాంధీ ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి తదితరులున్నారు.

## ఏపీయుడబ్ల్యుజె విరాళం..రూ. 50వేలు

విజయవాడ వరదబాధితుల సహాయార్థం ఏపీయుడబ్ల్యుజె (ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్) తరఫున రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఉపాధ్యక్షుడు జయరాజ్ 50 వేల రూపాయల విరాళాన్ని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు

# కొలిక్కివస్తున్న ఫోర్జరీ కేసు

- కోర్టులో లొంగిపోయిన మేయర్ భర్త జయవర్ధన్
- 14 రోజులు రిమాండ్ విధించిన న్యాయస్థానం

నెల్లూరు నగరపాలక సంస్థలో కమిషనర్ల సంతకాల ఫోర్జరీలకు సంబంధించిన కేసు ఇప్పుడిప్పుడే ఓ కొలిక్కి వస్తోంది. ఈ కేసులో నిందితులు ఒకరొకరుగా దొరికిపోతుండడంతో త్వరలోనే విచారణ ప్రారంభం కావచ్చని భావిస్తున్నారు. తాజాగా ఈనెల 10న ఈ కేసులోని నగర మేయర్ భర్త పొట్లూరి జయవర్ధన్ నెల్లూరులోని 5వ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోవడంతో, న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆయన్ను నెల్లూరు కేంద్రగారానికి తరలించారు. పోలీసులకు దొరకకుండా ముందస్తు బెయిల్‌కోసం ప్రయత్నాలు సాగిస్తున్న జయవర్ధన్, తన ప్రయత్నాలు ఫలించకపోవడంతో హఠాత్తుగా కోర్టులో లొంగిపోవడం సంచలనం కలిగించింది. త్వరలో పోలీసులు ఆయనపై కోర్టులో కస్టడీ పిటిషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. గత జులైలో అప్పటి కార్పొరేషన్ కమిషనర్లుగా ఉన్న వికాస్‌మర్మత్, హరితల సంతకాలను ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడ్డారనే విషయమై కమిషనర్ వికాస్‌మర్మత్ ఫిర్యాదు మేరకు పోలీసులు పలువురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో కొందరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఉన్న టీపీఓలను, జయవర్ధన్ వ్యక్తిగత సహాయకుడు శివకృష్ణలను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు నిందితులు నాగేంద్రబాబు, కార్తీక్‌మాలవ్యలు నగర డిఎస్పీ వద్ద లొంగిపోయినట్లు సమాచారం. ఇంకో నిందితుడు దిలీప్ కుమార్ పరారీలో ఉన్నారు. పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

## ఝాన్సీరాణి సెంటర్‌లో.. అన్నదానం

వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఈనెల 10న నెల్లూరులోని పాత జడ్పీ కార్యాలయం వద్దనున్న ఝాన్సీరాణి సెంటర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపావంశీధర్‌రెడ్డి, నాయకులు పి.సురేంద్రరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని అందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫణిరాజు, మొగరాల సురేష్, ప్రవీణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## నవధాన్యాలతో..భూసారం పెంపు

పంటపొలాలకు వేసే పచ్చిరొట్టకు బదులు నవధాన్యాలను వేస్తే భూసారం పెరుగుతుందని, తద్వారా పంటలు బాగా పండుతాయని జిల్లా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. ఆమేరకు నవధాన్యాల బ్యాగ్‌లను ఆయన రైతులకు అందజేశారు. ఈనెల 10న ఆయన తోటపల్లిగూడూరు మండలంలోని నరుకూరు రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ నవధాన్యాల్లో పెసర, పిల్లిపెసర, జీలుగ, జనుము, మొక్కజొన్న, ఆముదం, ఉలవలు, అలసందలుతో కలసిన పోషకాలుంటాయని తెలిపారు. నవధాన్యాల 10 కేజీల బస్తా వెయ్యిరూపాయలని, దీనిని సబ్సిడీతో కేవలం రూ. 200కే అందిస్తున్నామన్నారు. మండల వ్యవసాయాధికారిణి శిరీషా తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# నిరాశ్రయులకు అండగా గూడూరు ప్రజలు

**ఎమ్మెల్యే సునీల్‌కుమార్**





విజయవాడలో వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి సహాయక చర్యల్లో ఎమ్మెల్యే ఈ నెల 9న పాల్గొన్నారు. మంత్రి నారా లోకేశ్‌ను కూడా కలిసి గూడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంధ సంస్థలు, దాతలు అందించిన రూ.38.32 లక్షల చెక్కును, విరాళాలు అందించిన దాతల వివరాలను అందజేశారు. చిట్టమూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ సాంస్కృతిక విభాగం ప్రధానకార్యదర్శి నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



ఈనెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీమ్‌పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. గూడూరులోని కోర్టు ప్రాంగణంలో పోలీసులు, న్యాయవాదులతో ఈ నెల 10న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని కక్షిదారులకు తెలిపి కేసులు రాజీ చేసుకొనేలా పోలీసులు చొరవ చూపాలన్నారు. న్యాయమూర్తులు సులోచనారాణి, రాజేష్ పాల్గొన్నారు.

## త్వరిత గతిన సమస్యల పరిష్కారం

**సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా**



గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సీపీఎం నాయకులు ఉచిత ఇసుకపై, పలువురు భూ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ప్రజలకు హామీ ఇచ్చారు.

## ఉదారత చాటిన బలిజ సంఘం



గూడూరు బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం వారు విజయవాడ వరదల్లో నష్టపోయిన ప్రజలకి అండగా చదలవాడ హరిబాబు ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయలను గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్‌కి అందజేశారు.

## వృద్ధులకు రోటరీ హెల్పేజ్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల జరిగే హెల్పేజ్ కార్యక్రమం ఈ నెల 10న గూడూరు సొసైటీ, మఠంవీధిలోని ఎ.ఎ.ఆర్. రోటరీ భవనంలో జరిగింది. 26 మంది పేదవృద్ధులకు ఫల సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జి.జి.నాయుడు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్స్ బి.దశరధరామిరెడ్డి, మయూరి శ్యామ్ సుందర్‌రావు, రొటేరియన్స్ కిరణ్ చక్రవర్తి, రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, రాంప్రసాద్, రవికుమార్, బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి మహిళ... ఐలమ్మలా ఉద్యమించాలి

ప్రతి మహిళ చాకలి ఐలమ్మలా ఉద్యమించాలని, అప్పుడే దేశంలో మహిళలపై అఘాయిత్యాలు తగ్గుతాయని సీపీఐ నాయకులు అన్నారు. ఈనెల 10వతేదీ గూడూరు సీపీఐ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి మహిళా ఉద్యమ నాయకురాలిగా గుర్తింపు పొందిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్.ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జీ. శశికుమార్‌లు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రాత్మకమైందన్నారు. మగవారితో సమానంగా ఆ రోజుల్లోనే ఐలమ్మ సాయుధ పోరాటంలో అగ్రభాగాన ఉంటూ పెత్తందార్ల గుండెల్లో గుబులు పుట్టించిందన్నారు. ప్రస్తుత సమాజంలోని యువతులు, మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎంబేటి చంద్రయ్య, కె.నారాయణ, ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నాయకులు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి





విశాఖ స్టీల్ దేశంలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, భాజపా ప్రభుత్వం కావాలనే ఉత్పత్తిని తగ్గించి నష్టాల్లోకి నెట్టి ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని సిఐటీయూ నాయకులు ఆరోపించారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద ఈనెల 10న వారు ఆమేరకు నిరసన వ్యక్తం చేశారు.

## వరదపై.. 'బురద' రాజకీయాలు

# హద్దు దాటుతున్న సామాజిక మాధ్యమాలు



ఆంధ్రప్రదేశ్‌లో, అందులోనూ విజయవాడను అల్లకల్లోలం చేసిన వరదల్లో ఓ వైపు ప్రజలు అల్లాడిపోతుంటే, మరోవైపు సామాజిక మాధ్యమాల్లో బురద రాజకీయం పోటెత్తుతుండడం విచారకరం. వరదల్లో బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి దగ్గరనుంచి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రవ్యాప్తంగా ఎందరో కార్యకర్తలు, సేవాభిలాషులు వచ్చి రాత్రనక పగలనక వరద సహాయక కార్యక్రమాలు చేస్తుంటే, పనిగట్టుకుని లేనిపోని విమర్శలు చేస్తున్న సోషల్‌మీడియా తీరును చూస్తూ, అది యాంటీ సోషల్ మీడియాగా మారిందా అనిపిస్తోంది. బాధితులకు అండగా తాము న్నామంటూ కొన్ని మాధ్యమాలు నిజాయితీగా పనిచేస్తుంటే, మరికొంత మంది మాత్రం ప్రతి విషయాన్నీ రాజకీయ కోణంలో చూస్తూ, చిత్తం వచ్చినరీతిగా విమర్శలు చేస్తుండడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉంది. తమకు నచ్చిన, నచ్చని ప్రతి విషయాన్ని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్‌చేసే వారి సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్న అంశాలను వ్యూయర్లు గమనిస్తూనే ఉన్నారు. అయితే, సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టే ముందు అది అవతలవారికి, నిజంగా బాధితులకు నిస్వార్థ సేవలందిస్తున్నవారికి ఎంతటి ఇబ్బంది కలిగిస్తుందో ఆలోచించడం లేదని అనిపిస్తోంది. తాము పెడుతున్న పోస్టులు నిజమా, అబద్ధమా అని కూడా నిర్ధారించుకోవడం లేదు. ఇలాగే అయ్యుం టుందిలే అని ఊహించుకుని పోస్ట్ పెట్టే వారు కొంతమంది అయితే, ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేసేవారు మరికొంతమంది. ఈ విష సంస్కృతి ఎటుపోతుందో తెలియడం లేదు.

### వాస్తవాలు తెలుసుకోకుండా దుష్ప్రచారాలు :

ప్రతి ఒక్కరికి ఏదో ఒక రాజకీయ పార్టీ పట్ల అనుకూల భావం, ప్రతికూల భావం ఉంటుంది. అందులో తప్పులేదు. మనది ప్రజాస్వామ్యం కదా.. ఎవరి అభిప్రాయాలు వారివి. కానీ వాస్తవాలను నిర్ధారించుకో కుండా, దురుద్దేశపూర్వకంగా ఇతరులపై దుష్ప్రచారం చేయడం వలన వ్యవస్థలపై అది తీవ్ర ప్రభావం చూపుతుంది. అంతిమంగా ఇది ప్రజలకు బాగా నష్టం చేకూరుస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్రంలో విరుచుకుపడిన వరదలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టులను గమనిస్తే, అదంతా వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా, ఎవరో కొంతమంది నాయకుల ప్రోద్బలంతో చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వరదలపై ఇటీవల చేసిన ఒక వ్యాఖ్య తీవ్ర దుమారం రేపడం అందరికీ తెలిసిందే. ఈ వరదలు సహజమైనవి కావని, కావాలని వరద వచ్చేలా చేశారన్నట్టుగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఎంత అర్థరహితమో చూడండి. దానికి వత్తాసుగా జగన్ అనుకూల సోషల్ మీడియా మరెన్నో కల్పితాలు ప్రచారం చేయడం ఇంకా ఘోరం. ఇలాంటి వాటివల్ల బాధితులను ఆదుకునేవారికెవరికైనా ఆవేదన కలుగుతుంది. అలా చేయడంవల్ల చివరికి వారికి ఒరిగేదేమీ ఉండదు కూడా.

### విపరీత మనస్తత్వంతోనే విమర్శలు :

కొందరిలో విపరీతమైన మనస్తత్వం ఉంటుంది. వివాదాలు సృష్టిస్తే కానీ వారికి నిద్ర పట్టదు. వ్యక్తిత్వ హననం చేయడమే పనిగా పెట్టుకునే శాడిస్టు మనస్తత్వాలకూ కొదవలేదు. అలాంటి వారికి సామాజిక మాధ్యమాలు వేదికగా మారుతుండడమే బాధాకరం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, జర్నలిస్టుల పేరుతో ఎర్నలిస్టులు కొందరు పెద్దసంఖ్యలో యూట్యూబ్ చానళ్ళను పెట్టేసుకుంటున్నారు. జర్నలిజంలో ఓనమాలు తెలియని వారెందరో ఇలాంటి చానళ్లు పెట్టుకుని దందాలు నడిపిస్తున్నారు. ఇటీవల హైదరాబాదులో జర్నలిస్టులతో జరిగిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇదే ఆవేదన వ్యక్తం చేశారు కూడా. ఎవరు జర్నలిస్టులు? ఎవరు కాదు?.. తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని కూడా హితవు పలికారు. జర్నలిస్టుల పేరుతో కొన్ని పార్టీలకు అనుగుణంగా వ్యవహరిస్తూ ఆయా పార్టీల అజెండాలను మోసేవారి తీరు సహించలేనిదని ఆయన విమర్శించారు. ప్రధాన పత్రికలు, ప్రధాన టీవీ ఛానళ్లకు మించి అలాంటి యూట్యూబర్లు పుట్టుకొస్తున్నారని దుయ్యబట్టారు. అలాంటివారు కేవలం రాజకీయరంగంలోనే కాదు, ఇప్పుడు అన్ని రంగాల్లోకి చొచ్చుకుని వస్తున్నారు. సెలబ్రిటీల జీవితాల్లోకి కూడా తొంగి చూస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వదంతులు వ్యాప్తి చేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. వ్యక్తుల గురించి పెట్టే అలాంటి పోస్టుల గురించి పక్కనపెడితే, వరదల వంటి ప్రకృతి విపత్తులు వచ్చిన ప్పుడు, మానవతా దృక్పథంతో సాయం చేయాల్సిందిపోయి, విమర్శలతో సమస్యలను పక్కదారి పట్టించడం ఎవరికీ మంచిదికాదు. ఇకనైనా వాటిని మానుకుంటే మంచిది. నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరి చేతిలోనూ స్మార్ట్‌ఫోన్ ఉంది. సమాచారం క్షణాల్లో చేరిపోతుంది. అటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ హితం కోసం ఉపయోగించుకోవాలే తప్ప, సమాజానికి నష్టం చేయడానికి కాదు. కేరళలో వరదలు ముంచెత్తి, కొండచరియలు విరిగిపడినప్పుడు సామాజిక మాధ్యమాలు అక్కడి సహాయక చర్యలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో దీనికి భిన్నమైన పరిస్థితి ఉండడం మరీ దారుణం. సామాజిక మాధ్యమాలను మంచికి కాక, దుష్ప్రచారం చేయడానికి ఉపయోగించు కోవడం అనైతికం.. అమానవీయం. ఇలా దుష్ప్రచారం చేసేవారిని గుర్తించి వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్



## జానకిరామ.. రామాయణం 30

- ఊటుకూరు జానకి రామారావు

నీ కోరిక ఆయనను క్షోభపెడుతుంది. అది ఆయన పాలిటి మృత్యుపాశం. ఆయన ఇచ్చిన మాట ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకొంది. ఆ పాశములు నీవు విసరినవే!

వాటిని వెనుకకు తీసుకో!

రాముడు అన్నదమ్ములలో జ్యేష్ఠుడు, ఉదారుడు!

ఎంతటి క్లిష్టతరమైన కార్యాలనయినా నిర్వహింపగల సమర్థుడు.

స్వధర్మాన్ని కాపాడుకొనేవాడు. ప్రాణులను అందరినీ రక్షించేవాడు. మహాబలశాలి!

అటువంటి రామునికి పట్టాభిషేకం జరిగేటట్లుగా చూడు!

అనవసరమైన అపవాదులు, చెడ్డపేర్లు మోయకమ్మా! అని పలికి సుమంత్రుడు మరల నమస్కరిస్తూ నిలబడ్డాడు.

ఇంత పలికినా సుంత కూడా మార్పురాలేదు కైక ముఖకవళికలలో!

జనులేమనుకొన్న నాకేమి? నా పంతమే నాదిగానీ! అన్నట్లుగా నిశ్చలంగా బెల్లంకొట్టిన రాయిలాగ నిలబడి ఉంది.

దశరథుడది చూసి దీర్ఘంగా నిశ్వసిస్తూ, సుమంత్రా! రాముని వెంట సకల సంబారాలు పంపించు, చతురంగబలాలు అతనిని అనుసరించనీ! కోశాగారం సమస్తం రాముని వెంటే!

గీత, నృత్త, వాద్య బృందాలన్నీ రాముని తోటే వెళ్ళాలి.

సకల భోగవస్తువులన్నీ నా రాముడి వెంటే ఉండాలి, వనవాసం పదునాలుగేండ్లు విహారయాత్ర కావాలి, వెంటనే ఏర్పాట్లు గావించు అని ఆజ్ఞాపించాడు.

దశరథుడి ఆజ్ఞలు వింటూ కైక భయపడిపోయింది!

ఖాళీ అయిన బొక్కసం, సైన్యం లేని రాజసం, నిర్జన నగరం ఉండీ భరతుడికేం ఉపయోగం.

తను ఇంత చేసి అంతా వృధా అయిపోతుందేమో అనే వ్యధ ఒక్కసారిగా ఆవిడ హృదయాన్ని పట్టిపీడించింది.

అక్కరలేదు! సారహీనమైన రాజ్యమక్కరలేదు! అని నిస్సిగ్గుగా, నిర్లజ్జగా అందరి ఎదుటా గర్జించినట్లుగా పలికింది కైక!

ఓసీ! దురాత్మురాలా! నీకోరిక రాముడిని అడవికి పంపమనే! అంతేకానీ వైభవశూన్యుడైన రాముని పంపమని కాదు అని దశరథుడు గద్దించాడు కైకను.

తోకతొక్కిన త్రాచులాగా లేచింది, మీదకురికే రేచులాగా నిలుచుంది!

నేనన్నది మీ వంశంలో అసమంజసుని సగరుడు ఎలా పంపాడో అలాగ పంపమని! అంతేకానీ ధనధాన్యాలతో, చతురంగబలాలతో, దాసదాసీజనంతో విహారయాత్రకెళ్ళినట్లుకాదు.

ఈ విధంగా మాట్లాడుతున్న కైకను చూసి సిద్ధార్థుడనే మంత్రి..

అసమంజసుడితో రాముడికి పోలికా?

సకలసుగుణాభిరాముడు,సర్వలోకమనోహరుడు, సకలజీవ సంరక్ష కుడమ్మా రాముడు!

వాడు! అసమంజసుడు, పసిపిల్లల పీకలునొక్కి వారి ఏడుపులు విని ఆస్వాదించి ఆనందించేవాడు. వారిని గిరగిర త్రిప్పి సరయూ నదిలో బంతులు విసిరినట్లు విసిరే వాడు, లోకంలోని అసమంజసమైన పనులన్నీ చేసేవాడు!

వాడికీ, రామునికీ పోలికా! నీవు మాటలాడే దానిలో ఏమైనా ఔచిత్యమున్నదా.

వాడి బాధలు తట్టుకోలేక జనం మొరపెట్టుకొంటే భార్యతోసహా రాజ్యబహిష్కరణ శిక్ష విధించాడమ్మా సగర చక్రవర్తి!

అటువంటి దౌర్భాగ్యునితో రామునికి పోలిక తేవడమా! నీవు స్పృహలోనే ఉన్నావు కదా!

అసలు అడవికి పంపటానికి రాముడు ఏ నేరం చేశాడో మేమంతా తెలుసుకో గోరుతున్నాం, నిష్కారణంగా సత్పథగామిని శిక్షిస్తారా! ఆ పాపం ఊరకే పోదు!

సిగ్గూఎగ్గూలేని కైక ఇంతమంది ఇన్ని మాటలంటున్నా తనకేమీ పట్టనట్లు అలాగే ఉండిపోయింది.

తన కోసం తండ్రి పడుతున్న ఆరాటం చూశాడు. కైక పెడుతున్న అభ్యంతరాలూ విన్నాడు. వనాలలో నివసించబోయే తనకు చతురంగ బలాలు, సకల రాజపరివారము అవసరమా? అని తనను తానే ప్రశ్నించు కున్నాడు.

సవినయంగా తండ్రితో... తండ్రీ! వనవాసం చేయబోవు నాకు వీటితో పని ఏముంది? ఏనుగునే ఇచ్చివేసిన వాడికి దానిని కట్టే తాడుతో పని ఉంటుందా? రాజ్యాన్నే త్యజించినవాడికి రాజలాంఛనాలతో పని ఏముంది?

వనాలలో నాకు కావలసినవి ఒక గునపం, తట్ట ఈ రెండు వస్తు వులు మాత్రమే! కట్టుకోవడానికి నారచీరలిప్పించండి అవి చాలు అని స్థిరంగా పలికాడు రాముడు.

రాముడి నోట ఈ మాట ఎప్పుడైతే బయటకొచ్చిందో ఆ వెంటనే మతాబులాగ వెలిగిపోయింది కైక ముఖం. అప్పటివరకు ఆమె అనుకొన్నదానికి విరుద్ధంగా జరుగబోతుందేమో! సకలసంపదలు, సర్వసైన్యం, సకలజనులూ రాముని పరం కాబోతున్నవేమో? తను కోరిన వరాలలో అవి ఇవ్వవద్దని ఎక్కడా లేదు! కాబట్టి రాజు తనకు



బుద్ధిచెప్పడానికి రాముడికి ఎక్కడ ఇచ్చివేస్తాడేమో అని తెగ మధన పడ్డది! ఇప్పుడిక ఆ భయం లేదు! రాముడే వద్దన్నాడుగా!

ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా లోనికి నడిచింది. రాముడు కోరినవన్నీ స్వయంగా తానే తెచ్చి ఇచ్చింది!

సంతోషంగా స్వీకరించాడు వాటిని శ్రీరాముడు! అన్నదమ్ము లిరువురూ నారచీరలు ధరించారు!

సీతమ్మకు మాత్రం వాటిని ఎలా కట్టుకోవాలో తెలియక అయోమ యంగా చూస్తూ ఉంది.

పుట్టినప్పటి నుండీ పట్టు వస్త్రాలు తప్ప నారచీరలు ఎట్లా ఉం టవో కూడా చూసి ఎరుగదు !

ఒక చీర మెడచుట్టూ వేసుకొని ఇంకొకచీర చేతిలో పట్టుకొని నిలుచుంది. ఆమె అవస్థను చూశాడు రామచంద్రుడు! తానే స్వయంగా తనప్రియసతికి ఆమె కట్టుకున్న పట్టువస్త్రం పైననే నారచీర చుట్టబెట్టాడు.

ఆయన చక్కగా చీరచుడుతుంటే ఆవిడ ఆనందంగా చుట్టించుకొంది. వారి వదనాలలో కించిత్తు బాధకానీ, ఆక్రోశంకానీ, మోసపోయామే అని వేదన కానీ లేదు. వనవిహారానికి(వనవాసము) సిద్ధమయినట్లుగా సిద్ధమయ్యారు ముప్వురూ.

ఈ దృశ్యం చూసేవారి కన్నులలో గిర్రున నీరు తిరిగింది!

అసూర్యంపశ్య! ఎండకన్నెరుగని ఇల్లాలు, రాజకుమారి! కనుసన్నలలో వందలకొద్దీ పరిచారికలు. ఏరోజుకారోజు మేలు పట్టువస్త్రాలు తప్ప మామూలు వస్త్రములే ఎరుగని ఆవిడ నారచీరలు కట్టవలసి వచ్చింది కదా! విధిచేసే వింతలు, దాని క్రూరత్వము అందరి మనసులలో బాధను రగిలించాయి. ఒక్కసారిగా గొల్లున ఏడ్చారందరూ!.

అందరూ రాముడితో ఇలా అన్నారు.

రామా! సీతను వనవాసానికి వెళ్లమని ఎవరుచెప్పారు? నీవూ లక్ష్మణుడు వెళ్ళిరండి! సీత ఇక్కడే ఉంటుంది. సీతను చూస్తూ నిన్ను చూసినట్లే అనుకొని ఆనందంగా ఉంటాము నాయనా! అని అంటూ ఉంటే! వసిష్ఠులవారిక ఉండబట్టలేకపోయారు. ..(సశేషం)

# నేతలు.. దాతలు కావాలి

(మొదటిపేజీ తరువాయి)

పోవాలంటే ఈ సమయాన్ని చక్కగా వినియోగించుకోవాలి. ఏ విధమైన విమర్శలకు తావు లేకుండా చిత్తశుద్ధితో దానం చేయవలసిన అవసరం ఉంది. మన పెద్దలు చెప్పినట్లు 'ధర్మస్య త్వరితా గతిః' ఎందుకంటే రేపు ఏమౌతుందో ఎవరికీ తెలియదు. ఇచ్చే అవకాశం మనకు భగవంతుడు కల్పించినప్పుడు నోటికి కాకుండా, చేతికి పని చెప్పాలి. ఎముక లేదన్నట్లుగా సాయం అందించాలి. ఈ సాయమే రేపటి మలుపునకు మార్గదర్శనం అవుతుంది. రాష్ట్రంలో ఉన్న 175 అసంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న ప్రధాన పార్టీల నాయకులు స్పందించి తమ సంపాదన నుండి ఒక్కొక్కరు ఒక్కొక్క కోటి ఇచ్చినా 350 కోట్లు సమకూరు తాయి. అలాగే 25 పార్లమెంటు నియోజకవర్గాల అభ్యర్థులు కూడా తలా ఓ కోటి ఇస్తే మరో 50కోట్లు వస్తుంది. సంపాదనకి కాదేది అనర్హం అన్నట్లుగా రాజకీయాలలో చిన్న పదవి దొరికినా దానిని అడ్డం పెట్టుకుని కోట్లు మూటకట్టుకునే పెద్దమనుషులు చాలా మంది ఉన్నారు. ఇటువంటి సమయంలో స్పందించాల్సిన బాధ్యత వాళ్లందరిపైనా వుంది.

### ఇస్కాన్ సేవలు అమోఘం!

మొన్న వరదల సమయంలో ఇస్కాన్ పరిధిలోని అక్షయ పాత్ర ఫౌండేషన్ అందించిన సేవలు నిజమైన భగవద్దర్శనాన్ని ప్రతి ఒక్కరికీ చేయించాయి. భగవంతుడు అంటే ఏమిటో ఆచర ణలో చూపించాయి. ఆపన్నులను ఆదుకునే ఎవరైనా సాక్షాత్తు భగవంతుడితో సమానం.

### నాయకులే దేవుళ్ళు కావాలి!

ఇప్పుడు నాయకులు దేవుళ్ళు అయ్యే సమయం వచ్చింది. మీ పరిధిలో మీకు తెలిసిన సంస్థలు ఉంటాయి, ఆర్థికంగా నిలదొక్కుకున్న వ్యక్తులు ఉంటారు. వారిలో స్ఫూర్తి నింపాల్సిన నైతిక బాధ్యత కూడా రాజకీయ నాయకులపైన ఉంది. ఒకరిమీద ఒకరు బురద చల్లుకోవటానికి కొంతమంది నాయకులు ప్రయత్నిస్తున్నారే తప్ప, సమస్యల్లో ఉన్న వారిని ఆదుకునే ఆలోచన చేయటం లేదు. ఈ నేతలు ఇకనైనా మారాలి. తమ పోకడ మార్చుకోవాలి. రాజకీయాలని అడ్డం పెట్టుకుని తాము వెనకేసు కున్న మూటల నుండి కొన్నింటినైనా బయటకి తీయాలి. శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ తరహాలో ప్రజలు తమపై తిరగబడి తమ ఇళ్లపై తెగబడే దుస్థితిని తెచ్చుకోకుండా తమకై తామే స్పందించి చేయూతనందించాలి. తమ సద్గుణంతో వితరణ చేసి ఆపన్నుల అభినందనలని, అభిమానాన్ని అందుకోవాలి!





## ఒరేయ్ మనిషీ!

-ఊటుకూరు జానకిరామారావు

నా శరీరం మరణించింది
నేను పైకి ప్రయాణం ప్రారంభించాను
ఇంతలో అశరీరవాణి నన్ను పలకరించింది,
"స్వర్గమెట్లా ఉన్నది" అని...
అదేమిటి?
నేనింకా స్వర్గానికి వెళ్లలేదు
ఇప్పుడే కదా ప్రయాణం ప్రారంభించాను..
అని బదులిచ్చాను !
...
ధవళధవళ హిమాలయాలు
నీలినీలి పర్వతాలు
అంతే తెలియని సముద్రాలు
లోతైన పచ్చటి లోయలు
సమున్నత వృక్షాలు
మధుర ఫలాలు
పారే సెలయేర్లు
ఎన్నటికీ ఎండిపోని జీవనదులు
..
గంతులు వేస్తూ
కనులింతచేసి చూసే హరిణాలు
కమ్మగా పాడే కోకిలలు
పచ్చగా కనువిందు చేసే రాచిలుకలు
పురివిప్పి నాట్యం చేసే మయూరాంగనలు
పుడమిని శుభ్రం చేసే కాకుల గుంపులు
ఠీవిగా నడిచే మృగరాజులు
అందమైన నడకతో
కనువిందుచేసే ఏనుగుల మందలు
కమ్మటి పాలతో కడుపు నింపే గోమాత
మూడు పంటలిచ్చి ఆకలితీర్చే భూమాత
..
అమృతతుల్యమైన స్తన్యాన్నిచ్చి పెంచే అమ్మలు
నేనున్నానంటూ వెన్నంటి ఉండే దేవుడు 'నాన్న'.
వెచ్చటి సాంగత్యాన్నిచ్చే సరిజోడు
బోసినవ్వుల పసిపాప
..
ఎన్నో ఎన్నెన్నో
జంతువులు పక్షులు క్రిమికీటకాలు
వృక్షాలు లతలు
ఇన్ని ఉన్న.. ఇంకెన్నో ఉన్న
అద్భుతమైన.. అందమైన
స్వర్గాన్నుండే కదా నువు వస్తున్నావు?
దానిని అనుభవించలేని
నీకెందుకురా.. రెండో స్వర్గం?!..

# జీవీకే 5 కోట్ల సాయం

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబుని కూడా కలిసి ఆయన తనవంతు సహాయం అందించే అవకాశాలున్నాయి. తాను పుట్టిన ఆంధ్ర రాష్ట్రానికి, తాను ఎదిగిన తెలంగాణ రాష్ట్రానికి తాను ఎప్పుడూ రుణపడి ఉంటానని ఆయన చాలా సందర్భాలలో చెప్పారు.

### జిల్లాలో విస్తృత సేవలు..!

తన జన్మభూమి నెల్లూరులో కూడా ఆయన అనేక సేవాపరిమ ళాలని గుబాళింప చేస్తున్నారు. తమ స్వగ్రామంలో విద్య, వైద్య రంగాలకి ప్రాధాన్యత కల్పించి సేవలు అందిస్తున్నారు. నగరం లోని శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలో తొలి విడతగా సుమారు 22కోట్ల రూపాయల ఖర్చుతో అత్యాధునిక విద్యా సముదాయాన్ని నిర్మిస్తున్నారు.

# అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- డీఎఫ్ఓ చంద్రశేఖర్



అడవుల సంరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని జిల్లా అటవీ శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈనెల 11న నెల్లూరులోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో, ఆయన అటవీ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల స్ఫూర్తితో అందరూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆయన కోరారు. సోషల్‌ఫారెస్ట్ విభాగం అటవీ అధికారి శ్రీనివాసులురెడ్డి, రేంజర్ మాల్యాద్రి, అటవీ ఉద్యోగసంఘం నాయకులు పిచ్చిరెడ్డి, రవి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

ఆంధ్రప్రదేశ్ ప్రాథమికారోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న నెల్లూరులోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద వైద్యాధికారులు ఆందోళన చేపట్టారు. జిఓ నం.85ని రద్దుచేయాలని, టైంబౌండ్ ప్రమోషన్లు, ఇతర అల వెన్సులు వెంటనే ఇవ్వాలని, వైద్యాధికారుల సమస్యలు పరిష్క రించాలని వారు డిమాండ్ చేశారు. వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ వేమిరెడ్డితో..మంత్రి 'ఆనం' భేటీ



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇటీవల భేటీ అయ్యారు. విజయవాడలోని వేమిరెడ్డినివాసంలో వారు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలుసుకుని పలు అంశాలను చర్చించారు.

# విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త

- ఎస్ఇ విజయన్



విద్యుత్ ప్రమాదాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఇ విజయన్ చెప్పారు. ఈనెల 11న నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగాదారులు, ముఖ్యగా రైతులు ఆ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లవద్ద, పొలాలవద్ద, ఎక్కడైనా సరే విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే, వాటిని తాకకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. విద్యుత్‌తీగలకు దగ్గర్లో ఇనుపతీగలపై దుస్తులు ఆరవేయడం ఎంతో ప్రమాదకరమన్నారు. ఇళ్లలో హీటర్ల స్విచ్ ఆఫ్ చేయకుండా నీళ్లను తాకకూడదన్నారు. రైతులు తడిచేతులతో, చెప్పులు వేసుకోకుండా విద్యుత్ మోటార్లను ఆన్‌చేయడం, ఆఫ్ చేయడం వంటివి చేయ కూడదని, పొలాల్లో కంచెలకు విద్యుత్ కనెక్షన్ పెట్టకూడదని, పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్ల ఫీజులు ఎవరికి వారు పెట్టడం ప్రమాదకరమని చెప్పారు. ఆమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు.

# 'సెమీకాన్ ఇండియా-2024'కు.. ప్రధాని ప్రారంభోత్సవం

## ప్రత్యక్షప్రసారం ద్వారా తిలకించిన వీఎస్‌యు వైస్‌చాన్సలర్



ఇటీవల ప్రధాని మోడీ ఢిల్లీలో ప్రారంభించిన 'సెమీకాన్ ఇండియా-2024' ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని, నెల్లూరులోని వివిఎస్‌యు ప్రాంగణంలో ప్రత్యక్షప్రసారం ద్వారా వీఎస్‌యు వీసీ విజయభాస్కర్‌రావు తదితరులు వీక్షించారు. దేశంలోని సెమీకండక్టర్ రంగాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లే 'సెమీకాన్ ఇండియా-2024' ప్రారంభోత్సవం గ్రేటర్ నోయిడా, ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో ఘనంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొని సెమీకండక్టర్ రంగంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించడంపై అభినందనలు తెలిపారు. దేశానికి సమర్థవంతమైన సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ మరియు డిజైన్ సామర్థ్యాలను సాధించడానికి అవసరమైన పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని సర్ సీవీ రామన్ సెమినార్ హాల్‌లో ప్రత్యక్ష ప్రసారంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తిలకించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు మాట్లాడుతూ, 'సెమీకాన్ ఇండియా-2024' వంటి కార్యక్రమాలు, సెమీకండక్టర్ రంగంలో ఉన్న సాంకేతికతలను, అవకాశాలను విద్యార్థులకు, పరిశోధకులకు పరిచయం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. సెమీకాన్ ఇండియా-2024లో పరిచయమైన ఆ విషయాలను విద్యార్థులు మరియు ఫ్యాకల్టీ మరింతగా అధ్యయనం చేసి, భవిష్యత్తు పరిశోధనలకు పునాది వేస్తారని ఆయన ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, ఆచార్య సుజా ఎస్ నాయర్, డాక్టర్ యం.ఉస్సేనయ్య, డాక్టర్ హనుమా రెడ్డి, డాక్టర్ ఎ.శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల డ్యాంకు.. భారీగా వరదనీరు

సోమశిల జలాశయానికి భారీగా వరదనీరు వస్తోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు బాగా కురుస్తుండడంతో ఈనెల 11వ తేదీ నాటికి సోమశిల డ్యాంకు 15,879 క్యూసెక్కుల నీటిప్రవాహం వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసిలు. ఇప్పటికే నీటిమట్టం 48.234 టీఎంసీలకు చేరుకుంది. నీళ్ల పుష్కలంగా ఉండడంతో దిగువ డెల్టాకు 550 క్యూసెక్కులు, కండలేరుకు 10వేల క్యూసెక్కుల వంతున నీటిని సరఫరా చేస్తున్నారు.

## పశుసంవర్ధకశాఖ జేడీగా.. డాక్టర్ రమేష్



కావలిలో పశుసంవర్ధకశాఖ డెప్యూటి డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె.రమేష్ జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమితుల య్యారు. ఆ మేరకు ఆ శాఖ ఉన్నతాధి కారులు ఈనెల 8న ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఇన్‌చార్జి జేడీగా ఉన్న కోటేశ్వరరావును జేడీగా పదోన్నతి కల్పిస్తూ విజయవాడకు బదిలీ చేశారు. అదేవిధంగా, కోవూరులో డీడీ (డెప్యూటి డైరెక్టర్)గా ఉన్న సోమయ్యను జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం ప్రాంగణంలోని వెటర్నరీ పాలీక్లినిక్ డీడీగా బదిలీ చేశారు. పశుసంవర్ధకశాఖ కేంద్ర కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న మల్లారెడ్డికి డెప్యూటి డైరెక్టర్‌గా పదోన్నతినిచ్చి కావలి డెప్యూటి డైరెక్టర్‌గా నియమించారు. కందుకూరు డెప్యూటీ డైరెక్టర్‌గా శ్రీధర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

## ధాన్యం రైతులు నష్టపోకుండా చర్యలు

ధాన్యం కొనుగోళ్లలో రైతులు నష్టపోకుండా, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా ధాన్యాన్ని విక్రయించుకునేలా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఈనెల 10న ఆయన కలెక్టరేట్‌లో రైతులు, ధాన్యం వ్యాపారులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. బయట రాష్ట్రాల వారు జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో స్థానికంగా ఉన్న వ్యాపారులు కుమ్మక్కై ఇతర రాష్ట్రాల వ్యాపారులను రానీయకుండా చేసి, ధర తగ్గించేందుకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర పలికిన ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. రాబోయే వారం రోజుల్లో జిల్లాలో వర్షపాతం నమోదయ్యే అవకాశం లేదని వాతావరణ శాఖ తెలిపినందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనిత, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మామిడిపూడి రోడ్డు బాగుకు ఆటోవాలాల వినతి

ముత్తుకూరులోని జడ్పీ హైస్కూల్ సెంటర్ నుంచి బీసీ కాలనీ మీదుగా మామిడిపూడికి వెళ్లే రోడ్డు మరమ్మతులు లేకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ఆ రోడ్డును వెంటనే బాగుచేయించాలని ముత్తుకూరులోని ఆటో కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు ఈనెల 9న స్థానిక మండల ప్రజాపరిషత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## మనుబోలులో వైభవంగా లక్ష్మీగణపతి హోమం

వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మనుబోలులోని కోదండరామపురం వినాయకమండపం వద్ద ఈనెల 9న లక్ష్మీగణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆడిపూడి రామకృష్ణారెడ్డి-భువనేశ్వరి దంపతులు, వారి కుమార్తె భావన, కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## నిమజ్జనోత్సవంలో.. అపశ్రుతి

### -- ట్రాక్టర్ కిందపడి యువకుని మృతి --

వినాయక నిమజ్జనోత్సవంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కిందపడి మరణించడంతో భక్తులు ఆవేదనకు గురయ్యారు. కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట సముద్రతీరంలో ఈనెల 9న ఈ దుర్ఘటన జరిగింది. కావలిలోని ఇందిరానగర్‌లో ఏర్పాటుచేసిన గణేశుని విగ్రహాన్ని ఊరేగింపుగా సముద్రతీరానికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని కొళ్లదిన్నె వద్ద గతుకుల రోడ్డుపై ట్రాక్టర్ అదుపుతప్పడంతో మొగిలి రమేష్ అనే యువకుడు కిందపడడం, ట్రాక్టర్ ట్రాలీ టైరు రమేష్‌పై ఎక్కడంతో అక్కడికక్కడే మరణించాడు. రమేష్ మృతితో ఇందిరానగర్‌లో విషాదం అలముకుంది.

## 14 నుంచి పరిశుభ్రతా కార్యక్రమాలు



జిల్లా కలెక్టర్
ఆనంద్

'స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత' పేరుతో ఈనెల 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేకంగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఈనెల 9న కలెక్టరేట్‌లో ఆయన పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛత మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దీని అమలుకోసం జిల్లాలో 15 మంది అధికారులతో స్టీరింగ్‌కమిటీని ఏర్పాటుచేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను, బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి విద్యార్థులు, పొదుపు సంఘాల సభ్యులు, రైతులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధుల సహకారంతో శ్రమదానం ద్వారా ఆయా ప్రాంతాలను పరిశుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నవారికి అక్టోబర్ 2 గాంధీజయంతి రోజున అవార్డులను బహుకరిస్తామని, సఫాయి మిత్రులను సన్మానిస్తామని పేర్కొన్నారు.

## మొక్కలు నాటిన..ఎన్‌సిసి క్యాడెట్లు




పర్యావరణ పరిరక్షణ అందరి సామాజిక బాధ్యత అంటూ 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొరంగవే ఆదేశాల మేరకు సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో స్థానిక భక్తవత్సలనగర్‌లోని మునిసిపల్ పార్కులో ఇటీవల ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు మొక్కలు నాటారు. 'అమ్మ పేరుతో ఓ మొక్క నాటుదాం'లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను నరేంద్రబాబు వివరించారు. 'పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు', 'మొక్కలను నాటుదాం.. పర్యావరణం పరిరక్షిద్దాం' అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ, కెఎన్‌ఆర్ స్కూల్ వద్ద నుంచి గాయత్రీనగర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## జిల్లా ఔన్నత్యాన్ని చాటే..వీడియో, రీల్స్ పోటీలు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మన జిల్లాలోని చరిత్రాత్మక ప్రదేశాలు, సముద్రతీర ప్రాంతాలు, ప్రముఖ ఆలయాల ఔన్నత్యం తెలిపేలా వీడియో, రీల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఈనెల 9న ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టూరిజం కౌన్సిల్ ఛైర్మెన్..జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ వీడియో పోటీలకు 1 నిమిషం నిడివి గల వీడియోలు లేదా 15 నుంచి 30 సెకన్ల నిడివి గల రీల్స్‌ను పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గలవారు జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్శనీయ ప్రదేశాలైన ఉదయగిరి దుర్గం, మైపాడు బీచ్, ఇసుకపల్లి బీచ్, లైట్‌హౌస్, రామాయపట్నం బీచ్, లైట్‌హౌస్, జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయం, నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పెంచలకోనలోని శ్రీ పెనుశిల నరసింహస్వామి ఆలయం, నెల్లూరులోని శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయం తదితర పుణ్యక్షేత్రాలు, కండలేరు డ్యాం, సోమశిల రిజర్వాయర్ వంటి పర్యాటక ప్రదేశాల గొప్ప తనాన్ని తెలియజెప్పేలా వాటిని చిత్రీకరించి క్యూఆర్ కోడ్ ద్వారా ఈనెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పంపాలని ఆయన కోరారు. అత్యుత్తమ వీడియో, రీల్స్ చిత్రీకరించిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.15వేలు, 2వ బహుమతి రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు, అయిదుగురికి వెయ్యి రూపాయల చొప్పున కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాల కోసం తన సెల్ నెంబరు 98480 07024ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

నెల్లూరులోని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న వాకర్స్‌కు వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఎండ్రోక్రైనాలజిస్ట్ డాక్టర్ నిషితారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 3 వందల మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. వాకర్స్‌కు ఆర్బీఎస్, హెచ్‌బిఎ-1 సీ, థైరాయిడ్ పరీక్షలు చేసి తగు ఆరోగ్య సూచనలిచ్చారు. అనంతరం డాక్టర్ నిషితారెడ్డిని అసోసియేషన్ వారు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, ప్రెసిడెంట్ సుబ్బరాజు, సెక్రటరీ స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, చింతల అమరేంద్రరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సత్యనాథ్, జుల్ఫికర్ ఆలీ, పొన్నం రవిచంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

## టూకీగా...



### నరసింహకొండలో వైభవంగా.. 'స్వాతి' నక్షత్ర పూజలు

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసి వున్న శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం 'స్వాతి' నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఈనెల 8న అర్చకులు విశేషపూజలు చేశారు. స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, తిరుప్పావడ సేవలు వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఈ పూజా కార్యక్రమాలను తిలకించారు. ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ ఎం.సుధీర్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

### పడుగుపాడులో జనవిజ్ఞాన వేదిక సభ

కోవూరు మండలంలోని పడుగుపాడులో ఈనెల 8న జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) 17వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ, ప్రజాసైన్స్ ఉద్యమాలను నిర్వహిస్తూ సమసమాజ స్థాపనే ధ్యేయంగా జేవీవీ కృషిచేస్తోందని అన్నారు. చలంచర్ల భాస్కర్‌రెడ్డి, శంకరయ్య, ఉదయభాస్కర్, కాలేషాబాషా, గౌవుల్ ఆజం, చలపతిశర్మ, అంకయ్య, కృష్ణారెడ్డి, విద్యాచరణ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### రేవూరులో రక్తదాన శిబిరం

అనంతసాగరం మండలంలోని రేవూరులో ఈనెల 8న రక్తదాన శిబిరం జరిగింది. స్థానిక తేజోసాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు బోయళ్ల జనార్దన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయనతో పాటు, 70 మంది యువత రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి సాదిక్ హుస్సేన్, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీహరి, బోయిళ్ళ కొండారెడ్డి, అల్లంపాటి రాజేష్‌రెడ్డి, సన్నపరెడ్డి ప్రభాకర్, ఎల్లారెడ్డి తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

### పిడూరులో గడ్డివామి దగ్ధం

మనుబోలు మండలంలోని పిడూరు మిక్స్‌డ్‌కాలనీలో ఈనెల 18న అగ్నిప్రమాదం జరిగింది. ఎవరైనా బీడీయో సిగరెట్టో కాల్చి అక్కడపడేశారా ఏమో తెలియదు కానీ, మునుస్వామి అనే వ్యక్తి పశువుల మేతకోసం లక్షా 20వేల రూపాయలు ఖర్చుబెట్టి వేసుకున్న గడ్డివామి మొత్తం తగలబడిపోయింది. ఈ సంగతి తెలియడంతోనే గూడూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. కానీ, అప్పటికే గడ్డివామి ముక్కాలుభాగం బూడిదైపోయింది.

### బుచ్చిలో..మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. బుచ్చి టోల్‌ప్లాజా వద్ద నిఘాపెట్టి, ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్లను నడుపుతున్నవారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇస్కపల్లి జడ్పీ స్కూల్‌కు ఫర్నిచర్

అల్లూరు మండలంలోని ఇస్కపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు సదుపాయంగా స్కూల్ నిర్వహణ నిధి నుండి రెండు లక్షలతో వంద స్కూల్ బెంచ్‌లు, వగైరా ఫర్నిచర్‌కు మరమ్మతులు చేయించి, ఈనెల 9న విద్యార్థులకు అందజేశారు. బీద సోదరులు, బుజ్జంగారి బాబు సాయంతో వాటికి మరమ్మతులు చేయించామని ఎంఇఒ సునీత తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్యాద్రి, ఉపాధ్యాయులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కోవూరులో పౌష్టికాహార వారోత్సవాలు

కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 9న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు జరిగాయి. తక్కువ ఖర్చుతో తయారుచేసుకునే పలు పౌష్టికాహార పదార్థాలను గర్భవతులకు, బాలింతలకు సూచించి, వాటిపట్ల అవగాహన కలిగించారు. పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వ మెనూ ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని చెప్పారు.



# కృష్ణపట్నం పోర్టుకు వచ్చిన.. భారీ నౌక

ముత్తకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టులో బుధవారం ఉదయం భారీ నౌక (కేఫ్ వేజల్ )బెర్త్ నంబర్ 3కు వచ్చింది. అదాని కృష్ణపట్నం పోర్ట్ లోని మూడవ నంబర్ బెర్త్ లో మొట్టమొదటిసారి ఎంవి ఎన్‌లీ అనే పెద్ద నౌక రావడం, డ్రెజ్జింగ్ అనంతరం లంగరు వేయడం ఇదే ప్రథమం కావడం విశేషం. 288 .88



మీటర్ల పొడవు, 17.48 మీటర్ల ఎత్తు కలిగినఈ భారీ నౌక దక్షిణాఫ్రికా నుంచి లక్షా 50వేల మెట్రిక్ టన్నుల బొగ్గు లోడ్‌తో అదాని కృష్ణపట్నంపోర్ట్‌కు చేరుకొంది. పోర్టు సీఈఓ జీ.జే.రావ్, జగదీష్ పటేల్ ఈ నౌకకు ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో సిఓఓ రాజన్‌బాబు, కెప్టెన్ రజిత్‌గార్గ్, కెప్టెన్ సాహు, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి.వేణుగోపాల్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఎస్‌కె జునీద్, ఎం.డి సిరాజ్, వివిధ విభాగాల హెచ్‌ఓడిలు పాల్గొన్నారు.

# గణేష్ ఘాట్‌లో వైభవంగా నిమజ్జనోత్సవం

## వేలాదిమంది భక్తులతో శోభాయాత్ర-గంగాహారతులు



వినాయక చవితి సందర్భంగా నెల్లూరు చెరువు గట్టున నెల్లూరు గ్రామశక్తి శ్రీ ఇరుకళల అమ్మవారి దేవస్థానం వద్దనున్న గణేష్‌ఘాట్‌లో వినాయక నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అయిదురోజుల పాటు వినాయకుడికి పూజలు చేసి, ఈనెల 11న నిమజ్జనోత్సవం నిర్వహించారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో వేలాదిమంది భక్తులతో శోభాయాత్ర, గంగాహారతులు కన్నుల పండువగా జారిగాయి. కేరళవాద్యాలు, కోలాటాలు, భజనలతో, భక్తుల గణేశ నామోచ్చారణలతో ఈ సంబరం అంబరాన్నంటింది. నగరవ్యాప్తంగా వినాయక మండపాల నుంచి తరలివచ్చిన గణేశ ప్రతిమలను బాణసంచా వేడుకలతో, డీజే బ్యాండ్‌మేళాలతో పెద్ద ఎత్తున ఊరేగింపుగా తీసుకువచ్చి ఘాట్‌లలో నిమజ్జనం చేశారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

### పెన్నా బ్యారేజ్‌వద్ద భక్తజన కోలాహలం :

అదేవిధంగా పెన్నానది వద్ద జరిగిన నిమజ్జనోత్సవాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని గణేశునికి వేడుకగా నిమజ్జనోత్సవం చేశారు. నగరంలోని అనేక ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పెన్నాబ్యారేజ్ ప్రాంతమంతా క్రిక్కిరిసిపోయింది. భక్తులు నృత్యాలు చేస్తూ, జై గణేశా – జైజై గణేశా అంటూ పరవశించిపోతూ ఈ నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బాబోయ్!... గణపయ్య లడ్డూ.. 2.8 లక్షలు!



ఈనెల 11న వినాయకచవిత వేడుకల్లో నెల్లూరు బాలాజీనగర్ రైస్‌మిల్లు సెంటర్‌లో ఏర్పాటుచేసిన గణనాథుని మండపం వద్ద జరిగిన లడ్డూ వేలంపాట వేలనుంచి లక్షల్లోకి చేరింది. దాసరి అజంత్, ప్రశాంత్‌రెడ్డిలు ఏకంగా 2.8 లక్షల రూపాయలకు వేలంపాటలో గణపయ్య లడ్డూ దక్కించుకుని ఆనందించారు. అనంతరం నిర్వాహకులు వారిని అభినందించి సన్మానించారు.

# 'క్యాన్సర్ రహిత కోవూరు' లక్ష్యంగా.. ప్రశాంతమ్మ!






## • స్క్రీనింగ్ టెస్ట్‌లకు మొబైల్ పింక్ బస్సు ప్రారంభం

***ఆమె అందరు నాయకుల్లా కాదు. ఉత్తుత్తి వాగ్దానాలు చేయడం, ప్రజలను మభ్యపెట్టడం ఆమెకు చేతకాదు. చెప్పిన మాట నిలబెట్టుకోవడం, ప్రజలకు నిస్వార్ధంగా సేవ చేయడం ఆమె నైజం. అందుకే వేమిరెడ్డి ప్రశాంతమ్మ అంటే కోవూరు నియోజకవర్గ ప్రజలకు ఎనలేని అభిమానం. క్యాన్సర్ రహిత కోవూరు నియోజకవర్గాన్ని రూపుదిద్దాలనే ధ్యేయంతో, కోవూరు మహిళలకు ఎన్నికలప్పుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే ఏకైక లక్ష్యంతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అడుగులు వేస్తుండడంతో నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి అందుకోసం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు కూడా ఆమె సిద్ధం చేశారు. ఈనెల 10వ తేదీన ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్, టీటీడీ స్విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే మొబైల్ పింక్ బస్సును జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో పాటు ప్రశాంతిరెడ్డి ప్రారంభించి ప్రజల అభినందనలు అందుకుంటున్నారు.***

కోవూరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో వారం రోజులపాటు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేలా అన్ని ఏర్పాటు చేసినట్లు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ప్రజల్లో క్యాన్సర్ వ్యాధిపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఎంతో ఖరీదైన స్క్రీనింగ్ పరీక్షలను తమ నియోజకవర్గంలోని ప్రజలకు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. ఈ మొబైల్ బస్సులో అత్యాధునిక పరికరాలతో మూడు రకాల క్యాన్సర్ పరీక్షలను స్విమ్స్ వైద్యుల పర్యవేక్షణలో నిర్వహిస్తారని, 35 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తి ఉచితంగా మెరుగైన వైద్యం అందించే అవకాశం కలుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో తాను నియోజకవర్గంలో పర్యటించినప్పుడు క్యాన్సర్ రోగులు పడుతున్న బాధలను చూసి చలించిపోయానని, ఇకనుంచీ భవిష్యత్‌లో ఎవరూ అలాంటి కష్టాలు పడకూడదని ఈ పరీక్షలను ఉచితంగా చేయిస్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలోని క్యాన్సర్ రోగులు ఈ బస్సు వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుంటే, వారికి ఆరోగ్యశ్రీ లేదా టీటీడీ ప్రాణదాన ట్రస్ట్ ద్వారా పూర్తి ఉచితంగా వైద్యాన్ని అందించనున్నట్లు ఆమె వివరించారు. ఈ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను విజయవంతం చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఆమేరకు అవగాహన కల్పించి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలని, ప్రజలందరూ కూడా భయాన్ని విడనాడి ఆ పరీక్షలను చేయించుకునేందుకు ముందుకు రావాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, మంచి ఆలోచనతో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వేమిరెడ్డి దంపతులకు, టీటీడీ స్విమ్స్ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ రూ.10వేల వరకు ఖర్చయ్యే ఈ పరీక్షలను విపిఆర్ ఫౌండేషన్, స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 3.50 కోట్ల రూపాయల విలువైన ఈ మొబైల్ బస్సును స్విమ్స్‌కు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా వేమిరెడ్డి దంపతులు విరాళంగా అందించారని, ఈ బస్సు ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను అధిక సంఖ్యలో చేసి క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి పేదలకు మెరుగైన వైద్యం అందిసున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డిసిహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డాక్టర్ అర్జున్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, స్విమ్స్ వైద్యులు, జిల్లా వైద్యారోగ్యశాఖ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించిన డాక్టర్ అర్జున్‌రెడ్డి



ఇందుకూరుపేటలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల తీరును బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు డాక్టర్ అర్జున్‌రెడ్డి పరిశీలించారు. పింక్ బస్సు ద్వారా మహిళలకు అందుతున్న వైద్యసేవలపై ఆయన ఆరాతీశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలతో మాట్లాడుతూ, స్క్రీనింగ్ టెస్ట్‌ల వల్ల ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో వివరించారు.

## • శ్రీసిటీ–ఇసుజు పరిశ్రమ వితరణ

# చిన్న పాండూరు పీహెచ్‌సీకి రూ.4 లక్షల పరికరాలు




శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ వారు, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా సుమారు 4 లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలను చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వితరణగా అందజేశారు. ఈనెల 11న ఆసుపత్రి ఆవరణలో ఇసుజు వైస్ ప్రెసిడెంట్ సెంథిల్ మనోహర్, జనరల్ మేనేజర్ తకాషి రికుకావా, శ్రీసిటీ ప్రతినిధులు నిరీషా సన్నారెడ్డి, రమేష్ కుమార్‌ల సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు ఆ పరికరాలను ఇచ్చారు. వీటిలో ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్‌మెషిన్, ఆపరేషన్ టేబుల్, స్ట్రెచ్చర్ ట్రాలీ, బిపి యంత్రాలు, వాక్యూమ్ క్లీనర్లు, సెలైన్ స్టాండ్లు తదితర పరికరాలున్నాయి. ఈ సందర్భంగా సెంథిల్ మనోహర్ మాట్లాడుతూ, సీఎస్సార్ చర్యల్లో భాగంగా శ్రీసిటీ ప్రాంతంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తాము ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇసుజు సీఎస్సార్ చొరవను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో అభినందించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ సురేంద్రకుమార్, ఇసుజు సిబ్బంది, చిన్న పాండూరు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com